# నవజ్యోతి

తెలుగు దినపత్రిక

ప్రచురణ: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ | సంపుటి: 01 సంచిక : 280 | ఎడిటర్.: మన్నే లక్ష్మణ్ | వెల:5/- | పేజీలు: 8 | గురువారం 30-07-2026


## వర్షాలతో పులకించిన అన్నదాతలు.. జోరందుకున్న



2

## 8న గ్రాండ్‌గా టాక్సిక్ ట్రైలర్ లాంచ్ ప్లాన్



8



## పోలీసుల అదుపులో ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి

### లైంగిక వేధింపుల కేసులో విచారణ ముమ్మరం..

సహ ట్రైనీ మహిళా ఐపీఎస్ అధికారిని లైంగికంగా వేధించినట్లు నమోదైన కేసులో ట్రైనీ ఐపీఎస్ అధికారి ములగాని ఉదయ్ కృష్ణారెడ్డిని హైదరాబాద్ పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. అరెస్టుకు ముందు ఆయనకు ఉస్మానియా జనరల్ ఆస్పత్రిలో తప్పనిసరి వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం న్యాయస్థానంలో హాజరుపరిచారు.

2

## తైవాన్ పెట్టుబడులకు ఏపీ సిద్ధం

- ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్ రంగాలపై దృష్టి
- చంద్రబాబుతో తైవాన్ ప్రతినిధుల భేటీ

2






# 6జీ దిశగా భారత్ అడుగులు

### భారత్ 6జీ అలయన్స్ పురోగతిపై సమీక్ష

- 5జీ ప్రయోగశాలలకు ప్రతిభా పురస్కారాలు
- ప్రపంచ స్థాయి సహకారంపై దృష్టి పెట్టాలని సూచన
- 6జీ సాంకేతికతలో అగ్రస్థానమే లక్ష్యమన్న కేంద్రం

**న్యూఢిల్లీ, జూలై 29 (నవజ్యోతి ప్రతినిధి):**

దేశాన్ని 6జీ సాంకేతిక రంగంలో ప్రపంచ అగ్రగామిగా నిలపాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం వేగంగా ముందుకు సాగుతోంది. కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా భారత్ 6జీ అలయన్స్ పురోగతిని సమీక్షించి, 5జీ ప్రయోగశాల ప్రతిభా పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా 6జీ రంగంలో భారత్ సాధించాల్సిన లక్ష్యాలు, భవిష్యత్ కార్యాచరణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిర్దేశించిన దిశలో భారత్ 6జీ అలయన్స్ పనిచేస్తోందని తెలిపారు. ప్రపంచ టెలికాం సాంకేతికత అభివృద్ధిలో భారత్ ముందంజలో నిలిచి, కొత్త ఆవిష్కరణలకు నాయకత్వం మిగతా 2 లో..

## పాఠశాల భోజనంలో కొత్త ప్రతిపాదన



### మధ్యాహ్న భోజనంలో చికెన్ బిర్యానీ

- విద్యార్థులకు ఆరోగ్యకరమైన పౌష్టికాహారమే లక్ష్యం
- 40 లక్షల మందికి ప్రయోజనం
- పరిశీలనలో ఉన్న ప్రభుత్వ ప్రతిపాదన

2

**చెన్నై, జూలై 29 (నవజ్యోతి ప్రతినిధి):**

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మరింత పౌష్టికాహారం అందించడంతో పాటు మధ్యాహ్న భోజనాన్ని ఆకర్షణీయంగా మార్చేందుకు తమిళనాడు ప్రభుత్వం కీలక ప్రతిపాదనను పరిశీలిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా వారానికి ఒకసారి చికెన్ బిర్యానీ అందించే అవకాశంపై ప్రభుత్వం ఆలోచిస్తోంది. ఈ ప్రతిపాదనకు ఆమోదం లభిస్తే దేశంలోనే

మిగతా 2 లో..



## రాహుల్ వ్యాఖ్యలపై దుమారం

2

- ఆర్ఎస్ఎస్, అమిత్ షాపై తీవ్ర ఆరోపణలు
- పార్లమెంట్‌లో అధికార, ప్రతిపక్షాల మధ్య వాగ్వాదం
- వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలని అధికార పక్షం డిమాండ్

**న్యూఢిల్లీ, జూలై 29 (నవజ్యోతి ప్రతినిధి):**

లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు బుధవారం పార్లమెంట్‌లో తీవ్ర రాజకీయ దుమారానికి దారితీశాయి. ప్రశ్నపత్రాల లీకేజీ నిరోధక బిల్లుపై జరిగిన చర్చ సందర్భంగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా, రాష్ట్రీయ స్వయంసేవక్ మిగతా 2 లో..

## తెలంగాణలో పోలీస్ కొలువుల జాతర..!

- ఒకేసారి 7,437 పోస్టులకు నోటిఫికేషన్లు విడుదల..
- కానిస్టేబుల్ నుంచి ఎస్ఐ వరకు భారీ భర్తీ..
- జిల్లా, జోన్ వారీగా ఖాళీలు.. ఉద్యోగార్థులకు గోల్డెన్ ఛాన్స్...





## జపాన్‌ను వణికించిన భూకంపం

- రిక్టర్ స్కేల్‌పై 7.1 తీవ్రత నమోదు
- 13 మంది మృతి, పలువురి గల్లంతు
- కూలిన షాపింగ్ మాల్‌లో సహాయక చర్యలు
- అత్యవసర విపత్తు కేంద్రం ఏర్పాటు

2

## జమ్మూకశ్మీర్‌పై భారత్ మరోసారి స్పష్టత

- మొత్తం జమ్మూ కశ్మీర్, లద్దాఖ్ భారత్‌లో అంతర్భాగమేనని విదేశాంగ శాఖ వెల్లడి





2

## ప్రభుత్వానికి ఎల్ఐసీ భారీ డివిడెండ్

- రూ.12,207 కోట్ల చెక్కును అందజేసిన ఎల్ఐసీ
- ప్రభుత్వరంగ బ్యాంకుల లాభాలు, ఆస్తుల నాణ్యతలో రికార్డు పురోగతి

కేంద్ర ప్రభుత్వానికి ప్రభుత్వరంగ సంస్థల నుంచి భారీ మొత్తంలో డివిడెండ్లు అందుతున్నాయి. 2025-26 ఆర్థిక సంవత్సరానికి దేశంలోని అతిపెద్ద బీమా సంస్థ భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ) రూ.12,207 కోట్ల డివిడెండ్‌ను కేంద్ర ప్రభుత్వానికి అందించింది.

2



## గనుల రంగంపై కేంద్రంలో కీలక భేటీ

- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని కలిసిన కొల్లు రవీంద్ర
- రాష్ట్ర అభివృద్ధిలో గనుల రంగం పాత్రపై చర్చ



కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డిని ఆంధ్రప్రదేశ్ మంత్రి కొల్లు రవీంద్ర న్యూఢిల్లీలోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

2



2

## కంగనా క్షమాపణ చెప్పాలి

జెన్ జీ యువత, మహిళలపై వ్యాఖ్యలపై సీపీఐ ఆగ్రహం

## 6జీ దిశగా భారత్ అడుగులు

**మొదటిపేజీ తరువాయి**

వహించే దేశంగా ఎదగాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.భారత్ 6జీ అలయన్స్ ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న సాంకేతిక పురోగతిని నిరంతరం అధ్యయనం చేయాలని మంత్రి సూచించారు. వివిధ కార్యబృందాల మధ్య సమన్వయం, పరస్పర సహకారం మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉందన్నారు. పరిశోధన, ఆవిష్కరణ, ప్రమాణాల రూపకల్పనలో భారత సంస్థలు కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. దేశవ్యాప్తంగా ఏర్పాటు చేసిన 5జీ ప్రయోగ శాలలు సాంకేతిక పరిశోధన, నైపుణ్యాభివృద్ధికి కేంద్రాలుగా మారుతున్నాయని పేర్కొంటూ ఉత్తమ ప్రతిభ కనబరిచిన ప్రయోగశాలలకు మంత్రి ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఈ ప్రయోగశాలలు విద్యార్థులు, పరిశోధకులు, పరిశ్రమల మధ్య అనుసంధానానికి దోహదపడతాయని చెప్పారు. 6జీ సాంకేతికత అభివృద్ధిలో స్వదేశీ పరిశోధన, నవీన ఆవిష్కరణలు, పరిశ్రమల భాగస్వామ్యానికి కేంద్ర ప్రభుత్వం పూర్తి మద్దతు అందిస్తోందని మంత్రి స్పష్టం చేశారు. భవిష్యత్ డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో భారత్‌ను కీలక శక్తిగా నిలిపేందుకు అవసరమైన చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. భారత్‌ను 6జీ సాంకేతిక రంగంలో ప్రపంచ నాయకత్వ స్థానానికి తీసుకెళ్లేందుకు ప్రభుత్వం, పరిశ్రమలు, విద్యాసంస్థలు, పరిశోధనా సంస్థలు సమిష్టిగా పనిచేయాల్సిన అవసరం ఉందని మంత్రి పిలుపు నిచ్చారు. ప్రపంచ స్థాయి టెలికాం సాంకేతిక పరిజ్ఞాన అభివృద్ధిలో భారత్ కీలక పాత్ర పోషించే దిశగా భారత్ 6జీ అలయన్స్ కృషి కొనసాగిస్తోందని ఆయన పేర్కొన్నారు.

## పోలీసుల అదుపులో ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి

**హైదరాబాద్, జూలై 29 (నవజ్యోతి ప్రతినిధి):**

జూలై 18న అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో మరో ట్రైనీ మహిళా ఐపీఎస్ అధికారి ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది. వాట్సాప్‌లో అసభ్యకర సందేశాలు పంపడం, వెంటపడడం, అక్రమంగా నిర్బంధించడం, శారీరకంగా దాడి చేయడం, బెదిరించడం, వ్యక్తిగత వీడియోను రహస్యంగా చిత్రీకరించి ఆమె భర్తకు పంపి బ్లాక్‌మెయిల్ చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు భారతీయ న్యాయ సంహిత తో పాటు ఐటీ చట్టంలోని పలు సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. కేసు నమోదైన అనంతరం ఉదయ్ కృష్ణారెడ్డి తనపై వచ్చిన ఆరోపణలు నిరాధారమని సోషల్ మీడియాలో పేర్కొంటూ, విచారణలో సహకరిస్తానని వెల్లడించారు. అనంతరం ఆయన అపస్మారక స్థితిలో ఓ బంధువు ఇంట్లో కనిపించడంతో ఆస్పత్రికి తరలించగా, ఆత్మహత్యాయత్నం చేశారనే ప్రచారం జరిగింది. అయితే దీనిపై పోలీసులు దర్యాప్తు కొనసాగించారు. ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయిన తర్వాత ఆయన అందుబాటులో లేకపోవడంతో నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసిన పోలీసులు గాలింపు చేపట్టి మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. కేసు దర్యాప్తు కొనసాగుతోంది.

## ప్రభుత్వానికి ఎల్ఐసీ భారీ డివిడెండ్

**న్యూఢిల్లీ, జూలై 29 (నవజ్యోతి ప్రతినిధి):**

కేంద్ర ప్రభుత్వానికి ప్రభుత్వరంగ సంస్థల నుంచి భారీ మొత్తంలో డివిడెండ్లు అందుతున్నాయి. 2025-26 ఆర్థిక సంవత్సరానికి దేశంలోని అతిపెద్ద బీమా సంస్థ భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ) రూ.12,207 కోట్ల డివిడెండ్‌ను కేంద్ర ప్రభుత్వానికి అందించింది. ఇదే సమయంలో ప్రభుత్వరంగ బ్యాంకులు, ప్రభుత్వరంగ బీమా సంస్థలు కూడా మెరుగైన ఆర్థిక ఫలితాలు నమోదు చేసి ప్రభుత్వ ఆదాయానికి బలాన్నిచ్చాయి. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఎల్ఐసీ ఎండీ, సీఈవో సతీష్ కుమార్ దొరైస్వామి బుధవారం రూ.12,207 కోట్ల డివిడెండ్ చెక్కును అందజేశారు. ఈ విషయాన్ని కేంద్ర ఆర్థిక మంత్రి సామాజిక మాధ్యమ వేదిక ద్వారా వెల్లడించారు. అలాగే యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ.2,853 కోట్ల డివిడెండ్‌ను, న్యూ ఇండియా అష్యూరెన్స్ రూ.211 కోట్ల డివిడెండ్‌ను కేంద్ర ప్రభుత్వానికి అందజేశాయి.

## జమ్మూకశ్మీర్‌పై భారత్ మరోసారి స్పష్టత

**న్యూఢిల్లీ, జూలై 29 (నవజ్యోతి ప్రతినిధి):**

జమ్మూకశ్మీర్, లద్ధాఖ్‌కు సంబంధించి తప్పుడు ప్రచారాలు చేస్తున్న వారికి భారత విదేశాంగ మంత్రిత్వశాఖ మరోసారి గట్టి సమాధానం ఇచ్చింది. సామాజిక మాధ్యమ వేదికలో ప్రముఖ అమెరికన్ టెలివిజన్ కార్యక్రమంలోని ఓ పాత్రకు సంబంధించిన వైరల్ దృశ్యాన్ని పంచుకుంటూ "మీకు ఇది ఎన్నిసార్లు చెప్పాలి?" అనే భావంతో స్పందించింది. ఈ సందర్భంగా జమ్మూకశ్మీర్, లద్దాఖ్ ప్రాంతాలు మొత్తం భారత దేశంలో అంతర్భాగాలేనని స్పష్టం చేసింది. విదేశాంగ మంత్రిత్వశాఖ తన సామాజిక మాధ్యమ పోస్టులో జమ్మూకశ్మీర్, లద్దాఖ్ కేంద్ర పాలిత ప్రాంతాలపై పదేపదే తప్పుడు ప్రచారాలు చేసినా భారత వైఖరిలో ఎలాంటి మార్పు ఉండదని పేర్కొంది. ఈ రెండు ప్రాంతాలు భారతదేశానికి విడదీయరాని భాగాలని మరోసారి స్పష్టంగా ప్రకటించింది. అసత్య ప్రచారాలను వాస్తవాలుగా చూపించే ప్రయత్నాలను భారత్ ఖండిస్తుందని తెలిపింది. పాకిస్థాన్ ఆక్రమణలో ఉన్న ప్రాంతాలతో సహా మొత్తం జమ్మూకశ్మీర్, లద్దాఖ్ భారతదేశానికి చెందిన భూభాగమేనని విదేశాంగ శాఖ పునరుద్ఘాటించింది. ప్రస్తుతం పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లో నిర్వహిస్తున్న ఎన్నికలు అక్రమ ఆక్రమణను సమర్థించుకునేందుకు చేస్తున్న ప్రయత్నం మాత్రమేనని పేర్కొంది.

## కంగనా క్షమాపణ చెప్పాలి

**హైదరాబాద్, జూలై 29 (నవజ్యోతి ప్రతినిధి):**

జెన్ జీ యువత, మహిళలను ఉద్దేశించి ఎంపీ, సినీ నటి కంగనా రనౌత్ చేసిన వ్యాఖ్యలు అవమానకరంగా, అభ్యంతరకరంగా ఉన్నాయని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు కె. నారాయణ విమర్శించారు. తన వ్యాఖ్యలతో సమాజంలో పలువురి మనోభావాలను దెబ్బతీసిన కంగనా రనౌత్ బాధితులైన యువతకు, మహిళలకు బేషరతుగా బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజా జీవితంలో ఉన్న వ్యక్తులు, ముఖ్యంగా ప్రజాప్రతినిధులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేసే సమయంలో సంయమనం, బాధ్యతతో వ్యవహరించాలని నారాయణ సూచించారు. సమాజంలో విభేదాలు సృష్టించేలా, ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధంగా వ్యాఖ్యలు చేయడం ఏమాత్రం సమర్థనీయం కాదన్నారు. ప్రజా వేదికలపై మాట్లాడే ప్రతి మాట సమాజంపై ప్రభావం చూపుతుందని గుర్తుంచుకోవాలని సూచించారు. జెన్ జీ యువత, మహిళలపై చేసిన వ్యాఖ్యలు అనేక మందిలో ఆవేదన కలిగించాయని నారాయణ అన్నారు. ప్రజా జీవితంలో ఉన్నవారు సమాజంలోని అన్ని వర్గాల భావోద్వేగాలను గౌరవిస్తూ వ్యవహరించాలని, వివాదాస్పద వ్యాఖ్యలతో సామాజిక విభేదాలను పెంచకూడదని పేర్కొన్నారు. ఇదే సందర్భంగా గతంలో నిరసనకారులను ఉద్దేశించి చేసిన "బొద్దింకలు" వ్యాఖ్యలపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ స్పందించిన తీరును నారాయణ ప్రస్తావించారు. ఆ వ్యాఖ్యల వల్ల కలిగిన భావోద్వేగ బాధను గుర్తించి సరిదిద్దుకునే ప్రయత్నాన్ని స్వాగతించడం సానుకూల పరిణామమని పేర్కొన్నారు. తప్పును గుర్తించి దిద్దుకునే వైఖరి న్యాయ వ్యవస్థ గొప్పతనాన్ని, ఉన్నతమైన సంప్రదాయాలను ప్రతిబింబిస్తుందని నారాయణ అభిప్రాయపడ్డారు. ప్రజాస్వామ్యంలో బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్నవారు తమ మాటల ప్రభావాన్ని ఎప్పుడూ గుర్తుంచుకోవాలని సూచించారు. కంగనా రనౌత్ తన వ్యాఖ్యలపై పునరాలోచించి, వాటి వల్ల మనస్తాపానికి గురైన యువత, మహిళలకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని నారాయణ పునరుద్ఘాటించారు.

# పాఠశాల భోజనంలో కొత్త ప్రతిపాదన

**మొదటిపేజీ తరువాయి**

అత్యంత పురాతనమైన మధ్యాహ్న భోజన పథకంలో ఇది ఒక ముఖ్యమైన మార్పుగా నిలవనుంది. ప్రస్తుతం ఈ ప్రతిపాదన ప్రభుత్వ పరిశీలనలో ఉన్నట్లు అధికారులు తెలిపారు. మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తున్న సామాజిక సంక్షేమ, మహిళా సాధికారత శాఖతో చర్చలు జరిపిన అనంతరం తుది నిర్ణయం తీసుకోనున్నట్లు వెల్లడించారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని మెరుగుపరచడం, ప్రభుత్వ పాఠశాలల్లో హాజరును పెంచడం, పౌష్టికాహార లోపాలను తగ్గించడం ఈ ప్రతిపాదన వెనుక ప్రధాన ఉద్దేశమని అధికారులు పేర్కొన్నారు.

వారానికి ఒకసారి ప్రోటీన్ అధికంగా ఉండే చికెన్ బిర్యానీని అందించడం వల్ల విద్యార్థుల పోషకాహార స్థాయి మెరుగుపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. అలాగే పాఠశాలల్లో అందించే భోజనం నాణ్యతను పెంచేందుకు చర్యలు తీసుకుంటోంది. ముఖ్యంగా విద్యార్థులకు సరఫరా చేసే బియ్యం నాణ్యతను మరింత మెరుగుపరిచే అంశంపైనా ప్రభుత్వం దృష్టి సారించినట్లు సమాచారం. ప్రస్తుతం తమిళనాడులో ఒకటి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న సుమారు 40 లక్షల మంది విద్యార్థులు మధ్యాహ్న భోజన పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారు. అదేవిధంగా ముఖ్యమంత్రి అల్పాహార పథకం ద్వారా ఒకటి నుంచి ఎనిమిదో తరగతి వరకు సుమారు 32 లక్షల మంది విద్యార్థులకు ప్రతి రోజు అల్పాహారం అందుతోంది. ఈ రెండు పథకాలు రాష్ట్రంలో విద్యార్థుల పోషకాహారానికి కీలకంగా మారాయి.

ఈ పథకాలను పదకొండో, పన్నెండో తరగతుల విద్యార్థులకు కూడా విస్తరించాలనే ప్రతిపాదనను ప్రభుత్వం పరిశీలిస్తోంది. దీనివల్ల మరో 8 లక్షల మంది విద్యార్థులు ప్రయోజనం పొందే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఉన్నత పాఠశాల విద్యార్థులకు కూడా పౌష్టికాహారం అందించడం ద్వారా వారి హాజరు శాతం పెరగడంతో పాటు చదువు మధ్యలో మానివేసే వారి సంఖ్య తగ్గుతుందని విద్యా నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అయితే వారానికి ఒకసారి చికెన్ బిర్యానీ అందించే ప్రతిపాదనపై

# రాహుల్ వ్యాఖ్యలపై దుమారం

**మొదటిపేజీ తరువాయి**

సంఘ్ (ఆర్ఎస్ఎస్)పై రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలకు అధికార పక్ష సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. భారత విద్యా వ్యవస్థ ఆర్ఎస్ఎస్ ప్రభావంలోకి వెళ్లిపోయిందని రాహుల్ గాంధీ ఆరోపించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నామమాత్రపు పాత్ర మాత్రమే పోషిస్తున్నారని, విద్యా వ్యవస్థను తెరవెనుక ఆర్ఎస్ఎస్ నడిపిస్తోందని విమర్శించారు. విద్యార్థుల విద్యా భవిష్యత్తుపై ఆర్ఎస్ఎస్ ప్రభావం ప్రతికూలంగా ఉందని ఆయన వ్యాఖ్యానించారు. నీట్ పరీక్ష అవకతవకలకు వ్యతిరేకంగా విద్యార్థులు నిర్వహించిన నిరసన కార్యక్రమాన్ని ప్రస్తావించిన రాహుల్ గాంధీ, ఆ సందర్భంగా జరిగిన పోలీసు చర్యలకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా బాధ్యత వహించాలని ఆరోపించారు. నిరసనకారులపై పెల్లెట్లు ప్రయోగించేందుకు హోంమంత్రి అనుమతి ఇచ్చారని పేర్కొంటూ ప్రభుత్వ తీరును ఆయన తీవ్రంగా విమర్శించారు. రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలపై పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు తీవ్రంగా స్పందించారు. ఆధారాలు లేకుండా బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న వ్యక్తులపై ఆరోపణలు చేయడం సరికాదని, వెంటనే వ్యాఖ్యలను ఉపసంహరించుకుని సభకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కూడా బాధ్యతాయుతమైన చర్చలు జరగాలని సూచించారు. ఈ సందర్భంగా స్పీకర్ ఓం బిర్లా జోక్యం చేసుకుని, సభలో చేసే ఆరోపణలకు స్పష్టమైన ఆధారాలు ఉండాలని సభ్యులకు సూచించారు. ప్రజాప్రతినిధులు పార్లమెంటరీ సంప్రదాయాలను పాటించాలని, వ్యక్తిగత ఆరోపణల విషయంలో సంయమనం అవసరమని స్పష్టం చేశారు. రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకోవడంతో సభలో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి.

# తెలంగాణలో పోలీస్ కొలువుల జాతర..!

**హైదరాబాద్, జూలై 29 (నవజ్యోతి ప్రతినిధి):**

తెలంగాణలో పోలీస్ ఉద్యోగాల కోసం ఏళ్లుగా ఎదురు చూస్తున్న లక్షలాది మంది నిరుద్యోగ యువతకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ నియామక మండలి (టీజీపీఆర్‌బీ) బుధవారం ఒకేసారి నాలుగు నోటిఫికేషన్లు విడుదల చేసి మొత్తం 7,437 పోస్టుల భర్తీకి ప్రక్రియ ప్రారంభించింది. పోలీస్ శాఖ, తెలంగాణ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్, అగ్నిమాపక శాఖ, జైళ్ల శాఖల్లో కానిస్టేబుల్, సబ్ ఇన్‌స్పెక్టర్, స్టేషన్ ఫైర్ ఆఫీసర్, డిప్యూటీ జైలర్, ఫింగర్ ప్రింట్ బ్యూరో అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్, డ్రైవర్, మెకానిక్ పోస్టులను భర్తీ చేయనున్నారు. ఇది తెలంగాణ ఏర్పడిన తర్వాత జరిగిన అతిపెద్ద పోలీస్ నియామకాలలో ఒకటిగా నిలవనుంది. ఈ నియామకాలలో అత్యధికంగా 7,112 కానిస్టేబుల్ స్థాయి పోస్టులు ఉన్నాయి. ఇందులో పోలీస్ కానిస్టేబుల్ (సివిల్) 3,697, ఆర్మ్డ్ రిజర్వ్ కానిస్టేబుల్ 1,052, ఎస్ఏఆర్ సీపీఎల్ కానిస్టేబుల్ 24, తెలంగాణ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ కానిస్టేబుల్ 1,380, ఫైర్ ఫైటర్ 751, జైళ్ల శాఖలో వార్డర్ (పురుషులు) 196, వార్డర్ (మహిళలు) 12 పోస్టులు ఉన్నాయి. అదనంగా పోలీస్ కానిస్టేబుల్ (డ్రైవర్) 20, పోలీస్ కానిస్టేబుల్ (మెకానిక్) 7 పోస్టులను కూడా భర్తీ చేయనున్నారు. అధికారుల స్థాయి నియామకాలలో మొత్తం 275 పోస్టులు ఉన్నాయి. వీటిలో ఎస్ఐ (సివిల్) 148, రిజర్వ్ ఎస్ఐ (ఏఆర్) 14, రిజర్వ్ ఎస్ఐ (టీజీఎస్‌పీ) 12, రిజర్వ్ ఎస్ఐ (ఎస్ఏఆర్ సీపీఎల్) 3, తెలంగాణ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఎస్ఐ 44, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ 39, డిప్యూటీ జైలర్ (పురుషులు) 14, డిప్యూటీ జైలర్ (మహిళలు) 1 పోస్టు ఉన్నాయి. ఫింగర్ ప్రింట్ బ్యూరోలో 23 అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ పోస్టులను ప్రత్యేక నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయనున్నారు. ఈసారి నియామకాల ప్రత్యేకత ఏమిటంటే పోస్టులను జిల్లా, జోన్ వారీగా స్పష్టంగా ప్రకటించడం. కానిస్టేబుల్ (సివిల్), ఆర్మ్డ్ రిజర్వ్ పోస్టులకు జిల్లా, పోలీస్ కమిషనరేట్ వారీగా ఖాళీలను కేటాయించగా, ఎస్ఐ, స్టేషన్ ఫైర్ ఆఫీసర్, డిప్యూటీ జైలర్, టీజీఎస్‌పీ పోస్టులకు జోన్ వారీగా ఖాళీలను ప్రకటించారు. ఎస్ఐ (సివిల్) పోస్టుల్లో భద్రాద్రి జోన్‌కు 33, రాజన్న జోన్‌కు 32, బాసర జోన్‌కు 29, యాదాద్రి జోన్‌కు 22, కాళేశ్వరం జోన్‌కు 15, చార్మినార్ జోన్‌కు 13, జోగులాంబ జోన్‌కు 4 పోస్టులు కేటాయించారు. రిజర్వ్ ఎస్ఐ (ఏఆర్) పోస్టుల్లో కాళేశ్వరం, భద్రాద్రి జోన్‌లకు చెరో 6, బాసరకు 2 పోస్టులు లభించాయి. స్టేషన్ ఫైర్ ఆఫీసర్ పోస్టుల్లో చార్మినార్ జోన్‌కు అత్యధికంగా 13 పోస్టులు ఉండగా, రాజన్నకు 7, బాసరకు 5, జోగులాంబకు 5, కాళేశ్వరానికి 4, భద్రాద్రికి 3, యాదాద్రికి 2 పోస్టులు కేటాయించారు. టీజీఎస్‌పీ రిజర్వ్ ఎస్ఐ, డిప్యూటీ జైలర్ పోస్టులను కూడా ఇదే విధంగా జోన్‌ల వారీగా విభజించారు. కానిస్టేబుల్ పోస్టుల్లో వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు అత్యధికంగా 496 సివిల్, 125 ఏఆర్ పోస్టులు లభించాయి. రామగుండం కమిషనరేట్‌కు 353 సివిల్, 110 ఏఆర్, ఖమ్మం కమిషనరేట్‌కు 309 సివిల్, నల్గొండకు 251, సంగారెడ్డికి 243, మహబూబ్‌నగర్‌కు 203, సూర్యాపేటకు 159, కరీంనగర్ కమిషనరేట్‌కు 147, నిజామాబాద్ కమిషనరేట్‌కు 122, కామారెడ్డి జిల్లాకు 44 సివిల్, 25 ఏఆర్ పోస్టులు కేటాయించారు. ఫైర్ ఫైటర్ పోస్టుల్లో హైదరాబాద్ జిల్లాకు అత్యధికంగా 163, రంగారెడ్డికి 82, మెద్చల్-మల్కాజిగిరికి 39, నిజామాబాద్‌కు 34, యాదాద్రికి 31 పోస్టులు ఉన్నాయి. దరఖాస్తులను పూర్తిగా ఆన్‌లైన్‌లో మాత్రమే స్వీకరించనున్నారు. దరఖాస్తుల ప్రారంభ, ముగింపు తేదీలను త్వరలో ప్రత్యేకంగా ప్రకటించనున్నారు. ఒకటి కంటే ఎక్కువ నోటిఫికేషన్లకు దరఖాస్తు చేసే అభ్యర్థులకు ఒకేసారి పీఎంటీ, పీఈటీ నిర్వహించి అదే ఫలితాన్ని అన్ని పోస్టులకు వర్తింపజేయనున్నారు. అదనంగా రెండో నోటిఫికేషన్ నుంచి ఫీజులో రాయితీ కూడా ఇవ్వనున్నారు.

# తైవాన్ పెట్టుబడులకు ఏపీ సిద్ధం

**అమరావతి, జూలై 29 (నవజ్యోతి ప్రతినిధి):**

ఆంధ్రప్రదేశ్‌ను ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్ల తయారీ కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. తైవాన్‌కు చెందిన ప్రముఖ పారిశ్రామిక సంస్థల ప్రతినిధి బృందం బుధవారం అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌లతో సమావేశమై పెట్టుబడులు, పారిశ్రామిక భాగస్వామ్య అవకాశాలపై విస్తృతంగా చర్చించింది. డెల్టా ఎలక్ట్రానిక్స్, బెన్‌క్యూ, సీటీబీసీ బ్యాంక్, డైమెర్కో, మాస్టర్ హిల్, శాండ్ సన్, జిలీ కన్‌స్ట్రక్షన్స్ తదితర సంస్థల ప్రతినిధులు ఈ బృందంలో పాల్గొన్నారు. రాష్ట్రంలో అందుబాటులో ఉన్న పారిశ్రామిక వాతావరణం, మౌలిక సదుపాయాలు, పెట్టుబడులకు ప్రభుత్వం కల్పిస్తున్న ప్రోత్సాహకాలను ముఖ్యమంత్రి వారికి వివరించారు. ప్రపంచ స్థాయి పోర్టులు, విమానాశ్రయాలు, రహదారులు, రైల్వే అనుసంధానంతో ఆంధ్రప్రదేశ్ బలమైన పారిశ్రామిక కేంద్రంగా ఎదుగుతోందని పేర్కొన్నారు. ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్లు, ఎగుమతి ఆధారిత పరిశ్రమల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని చంద్రబాబు తెలిపారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే సంస్థలకు విధానపరమైన స్థిరత్వం, వేగవంతమైన అనుమతులు, పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన అన్ని రకాల సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. పరిశ్రమల విస్తరణకు అనువైన వాతావరణాన్ని ప్రభుత్వం నిరంతరం కల్పిస్తోందని వెల్లడించారు. భారత్‌లో ఇప్పటికే తైవాన్ సంస్థలు తయారీ రంగంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని, ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో కార్యకలాపాలు విస్తరించే అవకాశాలను పరిశీలిస్తున్నామని ప్రతినిధి బృందం తెలిపింది. సాంకేతికత, తయారీ, పారిశ్రామికాభివృద్ధి రంగాల్లో పరస్పర సహకారాన్ని మరింత బలోపేతం చేయాలని ఇరుపక్షాలు ఏకాభిప్రాయానికి వచ్చాయి. ఈ సమావేశాలు రాష్ట్రంలో విదేశీ పెట్టుబడులకు కొత్త అవకాశాలు తీసుకురానున్నాయని అధికారులు భావిస్తున్నారు.అనంతరం ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్‌తో జరిగిన సమావేశంలో మానవ వనరుల అభివృద్ధి, నైపుణ్య శిక్షణపై ప్రధానంగా చర్చించారు. తైవాన్ పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలతో ఏపీ యువతను తీర్చిదిద్దేందుకు శిక్షణా కార్యక్రమాలు, ఉన్నత విద్యా భాగస్వామ్యం, సెమీ కండక్టర్లు, ప్రిసిషన్ ఇంజనీరింగ్, పారిశ్రామిక స్వయంచాలకీకరణ వంటి రంగాల్లో ప్రత్యేక శిక్షణ అందించేందుకు చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. ప్రపంచ స్థాయి నైపుణ్య గ్రిడ్ ఏర్పాటు, మాండరిన్ భాషా శిక్షణ, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ధ్రువీకరణ కోర్సులు, ఇంటర్న్‌షిప్‌లు, విద్యార్థులు–అధ్యాపకుల పరస్పర మార్పిడి, సంయుక్త పరిశోధనలపై కూడా సమావేశంలో చర్చించారు.

# గనుల రంగంపై కేంద్రంలో కీలక భేటీ

**న్యూఢిల్లీ, జూలై 29 (నవజ్యోతి ప్రతినిధి):**

ఈ సందర్భంగా రాష్ట్రంలోని గనుల రంగానికి సంబంధించిన పలు అంశాలతో పాటు ఆ రంగం అభివృద్ధి అవకాశాలపై ఇరువురు మంత్రులు విస్తృతంగా చర్చించారు. సమావేశంలో ఆంధ్రప్రదేశ్‌లో గనుల రంగ అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలు, ఖనిజ వనరుల సమర్థ వినియోగం, రంగంలో పెట్టుబడులను ప్రోత్సహించే అంశాలపై అభిప్రాయాలు పంచుకున్నారు. రాష్ట్ర అభివృద్ధికి గనుల రంగం మరింత బలంగా దోహదపడే విధంగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించినట్లు సమాచారం.<గనుల రంగం ద్వారా రాష్ట్ర ఆర్థికాభివృద్ధిని మరింత వేగవంతం చేయడంతో పాటు ఉపాధి అవకాశాలను పెంచే అంశాలపైనా సమావేశంలో చర్చ జరిగినట్లు వెల్లడైంది. సహజ వనరులను పర్యావరణ పరిరక్షణకు భంగం కలగకుండా వినియోగిస్తూ స్థిరమైన అభివృద్ధి సాధించాల్సిన అవసరాన్ని ఇరువురు నాయకులు ప్రస్తావించినట్లు తెలిసింది. అలాగే గనుల రంగంలో ఆధునిక సాంకేతికత వినియోగం, పారదర్శక విధానాల అమలు, పెట్టుబడిదారులకు అనుకూల వాతావరణం కల్పించడం వంటి అంశాలపై కూడా అభిప్రాయాలు మార్పిడి చేసుకున్నారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల మధ్య సమన్వయంతో ఈ రంగాన్ని మరింత అభివృద్ధి చేయాల్సిన అవసరాన్ని గుర్తించినట్లు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఖనిజ సంపదను సమర్థవంతంగా వినియోగించి పారిశ్రామికాభివృద్ధికి ఊతమివ్వడంతో పాటు రాష్ట్రానికి ఆదాయ వనరులను పెంచే దిశగా చర్యలు చేపట్టాలని సమావేశంలో చర్చించినట్లు సమాచారం. గనుల రంగం అభివృద్ధి ద్వారా రాష్ట్రంతో పాటు దేశ ఆర్థిక ప్రగతికి కూడా మరింత తోడ్పాటు అందించే అవకాశాలపై ఇరువురు నాయకులు అభిప్రాయాలు పంచుకున్నారు. ఈ భేటీ స్నేహపూర్వక వాతావరణంలో జరిగినట్లు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వెల్లడించారు. రాష్ట్రం, దేశ అభివృద్ధికి గనుల రంగాన్ని మరింత సమర్థవంతంగా వినియోగించే అంశాలపై సానుకూల చర్చ జరిగినట్లు తెలిపారు.

# జపాన్‌ను వణికించిన భూకంపం

**టోక్యో, జూలై 29 (నవజ్యోతి ప్రతినిధి):**

జపాన్‌లో మంగళవారం సంభవించిన 7.1 తీవ్రత భూకంపం భారీ విధ్వంసానికి కారణమైంది. దక్షిణ జపాన్‌లోని ప్రధాన ద్వీపమైన క్యుషూలో సంభవించిన ఈ భూకంపం కారణంగా ఇప్పటివరకు 13 మంది మృతిచెందినట్లు జపాన్ ప్రభుత్వం వెల్లడించింది. పలువురు గాయపడగా, మరికొందరు శిథిలాల కింద చిక్కుకుపోయినట్లు అధికారులు తెలిపారు. ప్రభావిత ప్రాంతాల్లో సహాయక బృందాలు సహాయ చర్యలను ముమ్మరం చేశాయి. భూకంప ప్రభావంతో కషిమా పట్టణంలోని ఓ షాపింగ్ మాల్ కుప్పకూలింది. ఈ ఘటనలో ఇద్దరు ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు నిర్ధారించారు. దెబ్బతిన్న భవన శిథిలాల కింద మరికొందరు చిక్కుకుపోయి ఉండొచ్చన్న అనుమానంతో సహాయక సిబ్బంది నిరంతరం గాలింపు చర్యలు చేపడుతున్నారు. ప్రారంభంలో భారీ పేలుడు సంభవించినట్లు సమాచారం రావడంతో పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.

భూకంపం కారణంగా అనేక ప్రాంతాల్లో భవనాలు దెబ్బతినడంతో పాటు విద్యుత్ సరఫరా, రవాణా సేవలకు అంతరాయం ఏర్పడింది. కొన్ని ప్రాంతాల్లో తాగునీటి సరఫరా కూడా నిలిచిపోయినట్లు అధికారులు తెలిపారు. ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తూ తాత్కాలిక సహాయ శిబిరాలను ఏర్పాటు చేస్తున్నారు. నష్టంపై పూర్తి స్థాయి అంచనాలు కొనసాగుతున్నాయి. పరిస్థితిని సమీక్షించిన జపాన్ ప్రధాని అత్యవసర విపత్తు నిర్వహణ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ప్రకటించారు. సహాయక చర్యలను సమన్వయం చేసేందుకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసి, సంబంధిత మంత్రులతో కలిసి పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు.

## ఆగస్టు 10న పటాన్‌చెరులో ఘనంగా బోనాల పండుగ..

### పట్టణ ప్రముఖుల సమావేశంలో నిర్ణయం



**పటాన్‌చెరు, జూలై 29 (నవజ్యోతి ప్రతినిధి):**

పటాన్‌చెరు పట్టణంలో ఈ ఏడాది బోనాల పండుగను ఆగస్టు 10వ తేదీ (సోమవారం) ఘనంగా నిర్వహించాలని పట్టణ ప్రముఖుల సమావేశంలో నిర్ణయించారు. బోనాల పండుగ ఏర్పాట్లపై బుధవారం శ్రీ కోదండ సీతారామస్వామి దేవాలయంలో మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించగా, పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బోనాల పండుగ సందర్భంగా పట్టణంలోని అన్ని దేవాలయాల వద్ద అవసరమైన ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాల మధ్య బోనాల పండుగను ఘనంగా నిర్వహించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో మాజీ ప్రజాప్రతినిధులు, పట్టణ ప్రముఖులు, వివిధ కుల సంఘాల ప్రతినిధులు, పురోహితులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## వీరభద్రస్వామి ఆలయంలో భక్తిశ్రద్ధలతో చండీహోమం

- పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు
- వేదమంత్రాల నడుమ ఆధ్యాత్మిక వేడుకలు



**గుమ్మడిదల, జూలై 29 (నవజ్యోతి ప్రతినిధి):**

పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయంలో బుధవారం చండీహోమ కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని హోమగుండంలో వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ చండీహోమం నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి అనుగ్రహాన్ని పొందేందుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.దేవీ నామస్మరణ, మంగళవాయిద్యాల మధ్య ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో కార్యనిర్వహణ అధికారి రామ బ్రహ్మాచారి, మాజీ చైర్మన్ ప్రతాపరెడ్డి, మాజీ ధర్మకర్తలు భాస్కర్ గౌడ్, యాదగిరి గౌడ్, అశోక్ గౌడ్, సోమయ్య, అర్చకులు సిబ్బంది భక్తులు

## మహంకాళి దేవస్థాన వార్షిక బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు.

### ఘనంగా నిర్వహణ....7 నుంచి 10 వరకు...

- ఆలయ ట్రస్ట్ ఫౌండర్ చైర్మన్ సరాపు పాండురంగా చారి కార్య నిర్వహణాధికారి రవికుమార్...

**రామాయంపేట, జూలై 29 (నవజ్యోతి ప్రతినిధి)**



మెదక్ జిల్లా రామాయంపేట బస్టాండ్ సమీపంలోని శ్రీ మహంకాళి దేవస్థానంలో ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని ఆగస్టు 7 నుంచి 10, 2026 వరకు నాలుగు రోజుల పాటు వార్షిక బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త సరాపు పాండురంగ చారి, కార్య నిర్వహణాధికారి కె. రవికుమార్ తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ఆగస్టు 7న ఆలయ ఆవరణలో అఖండ దీపారాధన, గణపతి పూజ, అభిషేకం, సామూహిక కుంకుమార్చన, మంగళహారతులు, మంత్రపుష్పం, అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఆగస్టు 8న భక్తుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అమ్మవారి శాంతి కళ్యాణోత్సవం, ఒడి బియ్యం, శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతం, తీర్థప్రసాద వితరణ తదితర కార్యక్రమాలు జరుగనున్నాయి. ఆగస్టు 9న ఉదయం ప్రత్యేక పూజలు, మంగళహారతులు, తీర్థప్రసాద వితరణతో పాటు మధ్యాహ్నం ఎఫ్.టి. గారి ఇంటి నుంచి సజర్ బోనము, ఎఫ్.టీ. ఆధ్వర్యంలో కడప వద్ద పూజలు నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో ప్రధాన ఆకర్షణగా ఆగస్టు 10న సాయంత్రం 6:30 గంటలకు బోనాల ఊరేగింపు ఘనంగా నిర్వహించనున్నారు. భక్తులు అధిక సంఖ్యలో బోనాలతో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని వారు పిలుపునిచ్చారు. అనంతరం ప్రత్యేక పూజలు, తీర్థప్రసాద వితరణ, మహా మంగళహారతితో ఉత్సవాలు ముగియనున్నాయి. ఉత్సవాల్లో పాల్గొనే భక్తుల కోసం రూ.50 విరాళంగా నిర్ణయించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని వారు కోరారు.

# ఘనంగా గురుపౌర్ణిమ వేడుకలు

- సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఆదర్శ్ రెడ్డి దంపతులు

**రామచంద్రపురం (నవజ్యోతి ప్రతినిధి):**

గురు పౌర్ణిమ సందర్భంగా పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ ఆదర్శ్ రెడ్డి దంపతులు అమీన్‌పూర్ డివిజన్ పరిధిలోని సాయి కాలనీలో ఉన్న శ్రీ షిర్డీ సాయిబాబా ఆలయంలో ఘనంగా నిర్వహించిన గురుపౌర్ణిమ వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిబాబాకు పాలాభిషేకం, పుష్పార్చన, మహా హారతిలో పాల్గొని ఆశీర్వాదాలు పొందారు. అనంతరం ఆలయ నిర్వాహకులతో కలిసి భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. అనంతరం భారతి నగర్ డివిజన్ పరిధిలోని మాక్ సొసైటీ, ఓల్డ్ ఎంఐజీ కాలనీల్లో నిర్వహించిన గురుపౌర్ణిమ వేడుకల్లో కూడా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదర్శ్ రెడ్డి దంపతులు మాట్లాడుతూ గురువుల ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖశాంతులు, సిరిసంపదలు చేకూరాలని ప్రార్థించినట్లు తెలిపారు. గురువుల బోధనలు సమాజానికి మార్గదర్శకాలని, ప్రతి ఒక్కరూ వాటిని జీవితంలో ఆచరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అమీన్‌పూర్ మాజీ కౌన్సిలర్ బాల్‌రాజ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు జగన్నాథ్ రెడ్డి, మాక్ సొసైటీ కమిటీ సభ్యులు ఓల్డ్ ఎంఐజీ కాలనీ కమిటీ సభ్యులు అనిత, ప్రసాద్, మాజీ కౌన్సిలర్ నాగమణి, సత్యనారాయణ, వెంకట్ రెడ్డి, తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## గీతం ఫార్మసీకి ప్రతిష్టాత్మక 'ఎ' గ్రేడు..

- హైదరాబాద్, విశాఖ ఫార్మసీ స్కూళ్లకు అత్యున్నత గుర్తింపు..
- జాతీయ స్థాయిలో మరో ఘన విజయం

**పటాన్చెరు, జూలై 29 (నవజ్యోతి ప్రతినిధి)):**

ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (పీసీఐ), క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (క్యూసీఐ) సహకారంతో నాబెట్ నిర్వహించిన 2025–26 జాతీయ ఫార్మసీ కళాశాలల ర్యాంకింగ్, రేటింగ్‌లలో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఘన విజయం సాధించింది. గీతం విశాఖపట్నం, హైదరాబాద్ ఫార్మసీ స్కూళ్లు రెండూ అత్యున్నతమైన 'ఎ' గ్రేడును దక్కించుకున్నట్లు గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ, హైదరాబాద్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.ఎస్. కుమార్ తెలిపారు. దేశవ్యాప్తంగా బి.ఫార్మసీ కోర్సులు అందిస్తున్న 398 ఫార్మసీ కళాశాలలను ఈ మూల్యాంకనంలో పరిశీలించగా, వాటిలో కేవలం 64 సంస్థలు మాత్రమే ప్రతిష్టాత్మక 'ఎ' గ్రేడును సాధించాయి. ఈ జాతీయ ర్యాంకింగ్‌లో గీతం విశాఖపట్నం 43వ ర్యాంకు, గీతం హైదరాబాద్ 54వ ర్యాంకు సాధించి దేశంలోని అగ్రశ్రేణి ఫార్మసీ విద్యాసంస్థల్లో స్థానం దక్కించుకున్నాయి. ఫార్మాస్యూటికల్ విద్య, పరిశోధన, నాణ్యమైన బోధన, ఆధునిక మౌలిక సదుపాయాల కల్పనలో గీతం పాటిస్తున్న ఉన్నత ప్రమాణాలకు ఈ గుర్తింపు నిదర్శనమని ప్రొఫెసర్ జి.ఎస్. కుమార్ పేర్కొన్నారు. ఈ ఘన విజయానికి కృషి చేసిన రెండు ఫార్మసీ స్కూళ్ల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు, సిబ్బందిని గీతం యాజమాన్యం అభినందించింది.

GITAM
DEEMED TO BE UNIVERSITY

## గురువులే జీవితాలకు జ్ఞానదీపాలు..

- గురు పౌర్ణిమ వేడుకల్లో ఎమ్మెల్యే జీఎంఆర్
- సాయిబాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు.. అన్నప్రసాద వితరణ ప్రారంభం

**పటాన్‌చెరు, జూలై 29 ( (నవజ్యోతి ప్రతినిధి)):**

ప్రతి ఒక్కరి జీవితంలో అజ్ఞానం అనే చీకటిని పారద్రోలి జ్ఞాన జ్యోతిని వెలిగించే వారే గురువులని, గురువు లేని విద్య గుడ్డి విద్యతో సమానమని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. గురు పౌర్ణిమ పర్వదినాన్ని పురస్కరించుకుని భారతి నగర్ డివిజన్ పరిధిలోని మ్యాక్ సొసైటీలోని శ్రీ షిర్డీ సాయిబాబా దేవాలయం, బీరంగూడ డివిజన్ పరిధిలోని సాయి కాలనీలోని శ్రీ షిర్డీ సాయిబాబా దేవాలయం, ముత్తంగి డివిజన్ పరిధిలోని కర్ధనూరులోని శ్రీ షిర్డీ సాయిబాబా దేవస్థానంలో నిర్వహించిన గురుపౌర్ణిమ వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వాదాలు పొందారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరి జీవితంలో గురువుకు విశిష్ట స్థానం ఉందని, శిష్యులను ఉత్తమ వ్యక్తిత్వంతో తీర్చిదిద్దే మహోన్నతులు గురువులేనని పేర్కొన్నారు. గురు పౌర్ణిమ సందర్భంగా ప్రతి ఒక్కరూ తమ గురువులను స్మరించి వారి ఆశీస్సులు పొందాలని సూచించారు. అనంతరం కర్ధనూరులో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. సాయిబాబా ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాల్లో మాజీ కౌన్సిలర్ బాలమణి బాలరాజ్, ఐలేష్, వెంకట్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.



## ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలి..

- బూత్ స్థాయి నాయకులతో ఎమ్మెల్యే జీఎంఆర్, ఆదర్శ్ రెడ్డి సమీక్ష

**రామచంద్రాపురం, (నవజ్యోతి ప్రతినిధి)):**

ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియను మరింత వేగవంతం చేసి, అర్హులైన ప్రతి ఓటరితో ఎన్యూమరేషన్ ఫారాలు నింపించి నమోదు శాతాన్ని పెంచాలని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి (జీఎంఆర్) పిలుపునిచ్చారు.బుధవారం రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని లక్ష్మీ గార్డెన్స్‌లో మాజీ కార్పొరేటర్ తొంట ఆంజయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన భారతి నగర్, రామచంద్రాపురం డివిజన్‌ల బూత్ లెవల్ ఏజెంట్లు, బూత్ స్థాయి నాయకుల సమీక్షా సమావేశానికి ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ ఆదర్శ్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బూత్‌ల వారీగా ఎస్ఐఆర్ నమోదు శాతాన్ని సమీక్షించి, నమోదు శాతం పెంచాల్సిన బూత్‌లపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అలాగే ఓటరు జాబితాలోని డూప్లికేట్ నమోదులను గుర్తించి తొలగించే ప్రక్రియపై బూత్ లెవల్ ఏజెంట్లకు దిశానిర్దేశం చేశారు. ఆగస్టు 3వ తేదీ ఎస్ఐఆర్ ఎన్యూమరేషన్ ఫారాల సమర్పణకు చివరి తేదీ కావడంతో, ప్రతి బీఆర్ఎస్ నాయకుడు, కార్యకర్త బూత్ లెవల్ అధికారులతో సమన్వయం చేసుకొని ఇంటింటికీ వెళ్లి అర్హులైన ప్రతి ఓటరితో ఎన్యూమరేషన్ ఫారాలు నింపించి నమోదు పూర్తి చేయించాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, అర్హులైన ఒక్క ఓటరు కూడా నమోదు కాకుండా మిగలకుండా ప్రతి ఇంటికి వెళ్లి అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో , పృథ్వీరాజ్, ఐలేష్, ప్రమోద్ గౌడ్, రాజు తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# సేవ యజ్ఞంలో కొత్త అధ్యాయం

- లయన్స్ క్లబ్' ఆదర్శ్ సారథీగా కరుణ సాగర్ రెడ్డి
- కరుణ కురిపించే సేవకు ఆదర్శ నేతృత్వం
- ఆశయ సాధనకు కొత్త ఊపిరి
- లక్ష్యం సమాజ హితం మార్గం సేవ పంతం

**జిన్నారం జులై 29 (నవజ్యోతి ప్రతినిధి)**

సంగారెడ్డి జిల్లా జోగిపేటలో లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గ ఎన్నికల సమావేశం ఘనంగా నిర్వహించబడింది. నూతన అధ్యక్షుడి ఎన్నిక జిన్నారం పురపాలకు చెందిన పట్లోళ్ల కరుణాసాగర్ రెడ్డి లైన్స్ క్లబ్ నూతన ఆదర్శ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.




బాధ్యతలు స్వీకరణ జోగిపేట ప్రవేట్ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన సమావేశంలో నూతన అధ్యక్షుడితో పాటు కార్యవర్గ సభ్యులు ప్రమాణస్వీకారం చేసి బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా కరుణా సాగర్ రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో లయన్స్ క్లబ్ ఆఫ్ ఆదర్శ్ అధ్యక్షుడిగా ఎన్నుకున్న క్లబ్ సభ్యులకు ప్రతినిధులకు మరియు పెద్దలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. సమాజంలోని నిరు పేదలకు, బాధితులకు, అండగా నిలవడమే లయన్స్ క్లబ్ ప్రధాన ధ్యేయమని, రాబోయే రోజుల్లో సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తామని ఆయన ప్రకటించారు. ప్రత్యేక ప్రాధాన్యతలు ఉచిత వైద్య, కంటి పరీక్షల శిబిరాలు, రక్తదాన శిబిరాలు, ఉచిత వైద్యసాయం, మరియు పర్యావరణ పరిరక్షణ హరితహారం వంటి కార్యక్రమాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామని ఆయన వెల్లడించారు. కలసికట్టుగా ముందడుగు క్లబ్ సభ్యులందరి భాగస్వామ్యం సలహాలు మరియు సహకారంతో లయన్స్ క్లబ్ ఆఫ్ ఆదర్శను జిల్లాలోనే ఒక ఆదర్శవం మైన క్లబ్బుగా తీర్చి దిద్దుతాననీ ఆయన స్పష్టం చేశారు. సామాజిక బాధ్యత బాధ్యతగల పౌరులుగా సమాజ శ్రేయసే లక్ష్యంగా ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. నూతన కార్యవర్గం , ప్రధాన కార్యదర్శి చేట్టి శివరాజ్, కోశాధికారి ఆది రామకృష్ణ, ఉపాధ్యక్షులు నరసింహారెడ్డి, జింకల శివరాజ్, జాయింట్ సెక్రెటరీ అభిలాష్ గౌడ్, డైరెక్టర్ కొరివి ఆంజనేయులు, బత్తుల మహేష్, వడ్ల ఆనంద్,కొండి శ్రీనివాస్, బుషి గారి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# హుస్నాబాద్ మండల గ్రామాల సమగ్రాభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ

- **అధికారుల నిర్లక్ష్యాన్ని సహించేది లేదు**
- **మంత్రి పొన్నం ప్రభాకర్**

**హుస్నాబాద్ ప్రతినిధి, జూలై 29, (నవజ్యోతి ప్రతినిధి)**




హుస్నాబాద్ మండలంలోని అన్ని గ్రామాల సమగ్రాభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించి, మంజూరైన అభివృద్ధి పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వ పథకాల అమలుపై ఆయన విస్తృతంగా సమీక్ష నిర్వహించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని మంత్రి హెచ్చరించారు. తాగునీరు, వ్యవసాయం, విద్యుత్ సరఫరా, రవాణా, పంచాయతీరాజ్, రహదారులు, విద్య, ఉపాధి హామీ పనులు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం తదితర అంశాలపై శాఖల వారీగా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. సమీక్షా సమావేశానికి ముందస్తు సమాచారం లేకుండా గైర్హాజరైన విద్యుత్ శాఖ ఏఈపై మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామసభలకు సైతం హాజరు కావడం లేదని సర్పంచులు ఫిర్యాదు చేయడంతో ప్రజలకు అందుబాటులో ఉండని అధికారులపై చర్యలు తప్పవని స్పష్టం చేశారు. శాతవాహన విశ్వవిద్యాలయానికి విద్యుత్ కనెక్షన్ కోసం రూ.15 లక్షలు చెల్లించినప్పటికీ ఇప్పటివరకు కనెక్షన్ ఇవ్వకపోవడంపై అధికారులను నిలదీసి, వెంటనే సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. హుస్నాబాద్ మండలానికి మంజూరైన 240 ఇందిరమ్మ ఇళ్లలో 210 ఇళ్ల నిర్మాణం కొనసాగుతోందని అధికారులు వివరించారు. మిగిలిన ఇళ్ల నిర్మాణాన్ని వెంటనే ప్రారంభించాలని, ఆలస్యం చేస్తే మంజూరులను రద్దు చేయాల్సి వస్తుందని మంత్రి హెచ్చరించారు. నిర్మాణాలు పూర్తిచేసిన గ్రామాలకు తదుపరి విడతలో అదనపు ఇళ్ల మంజూరులో ప్రాధాన్యం కల్పిస్తామని తెలిపారు. పంచాయతీరాజ్, ఆర్అండ్బీ శాఖల పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, నిలిచిపోయిన టెండర్ల ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. అభివృద్ధి పనులు ఎక్కడా నిలిచిపోకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. పొట్లపల్లి, పందిళ్ల, కోహెడ మార్గాల్లో తక్షణమే ఆర్టీసీ బస్సు సర్వీసులు ప్రారంభించాలని మంత్రి ఆదేశించారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో ఏ గ్రామానికి బస్సు సౌకర్యం లేదనే పరిస్థితి ఉండకూడదని స్పష్టం చేస్తూ, ప్రతి గ్రామానికి రవాణా సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎల్నినో ప్రభావంతో భవిష్యత్తులో నీటి ఎద్దడి తలెత్తే అవకాశమున్నందున తాగునీటి సమస్యలు రాకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని, రైతులకు ఆరుతడి పంటల సాగుపై అవగాహన కల్పించాలని మంత్రి సూచించారు. నర్మెటలో ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ అందుబాటులో ఉన్న నేపథ్యంలో మండలంలో ఆయిల్ ఫామ్ సాగును విస్తరించాలని, ప్రభుత్వ సబ్సిడీలు, ప్రోత్సాహకాలపై రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఉపాధి హామీ పథకం ద్వారా ఇంకుడు గుంతలు, బోర్‌వెల్ రీఛార్జ్ పిట్లు ఏర్పాటు చేసి భూగర్భ జలాల పెంపునకు చర్యలు చేపట్టాలని, ప్రతి గ్రామంలో జల సంరక్షణ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. అర్హులైన రైతులు ప్రభుత్వ సహాయంతో వ్యవసాయ బావులు తవ్వుకునే అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో అదనపు తరగతి గదులు, వంటశాల షెడ్లు నిర్మించాలని, మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని మంత్రి ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులపై సర్పంచులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించాలని, హుస్నాబాద్ మండలంలోని అన్ని గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో స్పెషల్ ఆఫీసర్ కొండల్ రెడ్డి, ఎంపీడీఓ సురేష్, ఏఎంసీ చైర్మన్ తిరుపతి రెడ్డి, ఫ్యాక్స్ చైర్మన్ శివయ్య, ఆత్మ కమిటీ చైర్మన్ ఐలయ్య, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# అత్యధిక ఆదాయం అందించే పట్టుపురుగుల పెంపకంపై రైతులు దృష్టి పెట్టాలి

**జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి**

**సిద్దిపేట కలెక్టరేట్, జూలై 29, (నవజ్యోతి ప్రతినిధి)**




వ్యవసాయ అనుబంధ రంగాల్లో అత్యధిక ఆదాయాన్ని అందించే పట్టుపురుగుల పెంపకంపై జిల్లా రైతులు దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి పిలుపునిచ్చారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పట్టు పరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో "మేరా రేషన్-మేరా అభియాన్ 2.0 (నా పట్టు-నా అభిమానం 2.0)" కార్యక్రమంలో భాగంగా జిల్లా స్థాయి భాగస్వామ్య వర్గాల సంప్రదింపుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పట్టు పరిశ్రమ తెలంగాణ రాష్ట్ర నోడల్ అధికారి లత, పట్టు పరిశ్రమ శాఖ సహాయ సంచాలకుడు ఇంద్రసేనారెడ్డి జిల్లాలో పట్టు పరిశ్రమ అభివృద్ధికి చేపడుతున్న చర్యలను వివరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలో 1,313 ఎకరాల్లో 482 మంది రైతులు మల్బరీ సాగు చేస్తున్నారని తెలిపారు. 2026-27 సంవత్సరానికి 200 ఎకరాల విస్తరణ లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటికే 42 ఎకరాల్లో కొత్తగా సాగు ప్రారంభమైనట్లు వెల్లడించారు. ప్రస్తుత ఎల్‌నీనో పరిస్థితుల్లో వరి వంటి అధిక నీటి అవసరమున్న పంటలకు ప్రత్యామ్నాయంగా పట్టు పరిశ్రమను రైతులకు పరిచయం చేయడం సులభమవుతుందని, అధికారులు గ్రామాల వారీగా అవగాహన కల్పించి రైతులను ప్రోత్సహించాలని సూచించారు. సిద్దిపేట జిల్లా పట్టుపురుగుల పెంపకానికి అనుకూల ప్రాంతమని, ఉత్పత్తులకు మంచి మార్కెటింగ్ అవకాశాలు కూడా ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. ఈ పరిశ్రమ ద్వారా రైతులకు నెలనెలా ఆదాయం లభిస్తుందని, ఒక ఎకరం వరి పండించడానికి అవసరమయ్యే నీటితో రెండు ఎకరాల మల్బరీ తోటలను సాగు చేయవచ్చని చెప్పారు. ఒక ఎకరంలో సంవత్సరానికి ఐదు పంటలు తీసుకోవచ్చని, ఏడాదికి రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు ఆదాయం పొందే అవకాశం ఉందని వివరించారు.

ఇప్పటికే పట్టుపురుగుల పెంపకంలో విజయవంతమైన రైతులు తమ అనుభవాలను ఇతర రైతులతో పంచుకోవాలని, అవసరమైన సలహాలు, సూచనలు అందించి మరింత మందిని ఈ రంగంలోకి తీసుకురావాలని కోరారు.

జిల్లాలో పట్టుపురుగుల మార్కెటింగ్‌కు అవసరమైతే భూమిని కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నట్లు కలెక్టర్ కట్టా హైమావతి తెలిపారు. పట్టు పరిశ్రమ అభివృద్ధికి అధికారులు విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు విజయవంతమైన పట్టు క్షేత్రాలకు రైతులతో అధ్యయన పర్యటనలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అలాగే భూగర్భ జలాల సంరక్షణ కోసం రైతులు తమ వ్యవసాయ క్షేత్రాల్లో వీబీజీ రాంజీ పథకం ద్వారా ఉచితంగా ఫామ్‌పాండ్లు నిర్మించుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో "మేరా రేషన్-మేరా అభియాన్ 2.0" రాష్ట్ర నోడల్ అధికారి తిరుపంరెడ్డి, పట్టు పరిశ్రమ శాఖ అధికారులు, పట్టు రైతులు తదితరులు

# ఓటరు గుర్తింపు కార్డుకు ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ఎలాంటి సంబంధం లేదు

- **అపోహలను నమ్మవద్దు**
- **జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కట్టా హైమావతి**

**సిద్దిపేట కలెక్టరేట్, జూలై 29, (నవజ్యోతి ప్రతినిధి)**



సిద్ధిపేట జిల్లాలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం (సర్-2026) కొనసాగుతున్న నేపథ్యంలో ఓటరు గుర్తింపు కార్డు (ఈపిక్)ను ఏ ప్రభుత్వ సంక్షేమ పథకానికీ అనుసంధానం చేయడం లేదని జిల్లా ఎన్నికల అధికారి, సిద్దిపేట జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి బుధవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. రేషన్ కార్డు, పెన్షన్, రైతు భరోసా, ఆరోగ్య పథకాలు లేదా ఇతర ప్రభుత్వ సేవలతో ఓటరు గుర్తింపు కార్డుకు ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. ఓటరు గుర్తింపు కార్డు కేవలం ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోవడానికి మాత్రమే ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. కొంతమంది "ఎన్యూమరేషన్ ఫారం సమర్పిస్తే ప్రభుత్వ సంక్షేమ పథకాలు నిలిచిపోతాయి", ఓటరు కార్డును ఇతర ప్రభుత్వ పథకాలతో అనుసంధానం చేస్తారు" అనే తప్పుడు ప్రచారం చేస్తున్నట్లు గుర్తించామని, ఇలాంటి ప్రచారం పూర్తిగా అవాస్తవమని కలెక్టర్ తెలిపారు. ప్రజలు ఎలాంటి అపోహలకు గురికావద్దని విజ్ఞప్తి చేశారు. ఇప్పటివరకు ఎన్యూమరేషన్ ఫారం సమర్పించని అర్హులైన ఓటర్లు తమకు కేటాయించిన బూత్ స్థాయి అధికారిని లేదా సమీప సహాయ కేంద్రాన్ని సంప్రదించి, వీలైనంత త్వరగా ఎన్యూమరేషన్ ఫారం సమర్పించాలని సూచించారు. ఎన్యూమరేషన్ ఫారం సమర్పించడం వల్ల ఓటరు వివరాలు ఓటరు జాబితాలో సక్రమంగా నమోదు కావడం, అవసరమైన సవరణలు చేయడం, ఎన్నికల సంఘం రికార్డులను నవీకరించడం మాత్రమే జరుగుతుందని తెలిపారు. ప్రజలకు ఏవైనా సందేహాలు ఉంటే సంబంధిత బూత్ స్థాయి అధికారి, ఎన్నికల నమోదు అధికారి కార్యాలయం లేదా ఏర్పాటు చేసిన సహాయ కేంద్రాలను సంప్రదించి సరైన సమాచారం తెలుసుకోవాలని సూచించారు. సామాజిక మాధ్యమాలు లేదా ఇతర మార్గాల ద్వారా వచ్చే అసత్య ప్రచారాలను నమ్మవద్దని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి విజ్ఞప్తి చేశారు.

# ఎంపీడీవో కార్యాలయం వద్ద తప్పిన పెను ప్రమాదం

**చెట్టు కూలి దెబ్బతిన్న వాహనాలు**

**దుబ్బాక ప్రతినిధి, నవజ్యోతి ప్రతినిధి)**

గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు దుబ్బాక ఎంపీడీవో కార్యాలయం వద్ద పెను ప్రమాదం తప్పింది. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం జరుగుతోంది. ఈ క్రమంలో కార్యాలయం ముందు ఉన్న భారీ వృక్షం ఒక్కసారిగా నేలకూలింది. అక్కడ పార్కు చేసిన పలు వాహనాలు ధ్వంసమయ్యాయి. ఈ ప్రమాదం జరిగిన సమయంలో ఆ ప్రాంతంలో ఎవరూ లేకపోవడంతో వారికి ప్రాణాపాయం తప్పింది. ఎవరికీ ఎలాంటి ప్రాణాపాయం జరగలేదు. సమాచారం అందుకున్న వెంటనే అధికారులు, సిబ్బంది అప్రమత్తమయ్యారు. మున్సిపల్ సిబ్బంది రంగంలోకి దిగి కూలిన చెట్టును తొలగించే పనులు చేపట్టారు. అనంతరం సమీక్ష సమావేశం యథావిధిగా కొనసాగింది.



# గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలి

**మంత్రి అడ్లూరి లక్ష్మణ్**



**జగిత్యాల/పెగడపల్లి, జూలై 29, (నవజ్యోతి ప్రతినిధి)**

గ్రామాల సమగ్ర అభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, ప్రతి గ్రామంలో ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. పెగడపల్లి ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం గ్రామ సర్పంచులు, మండల స్థాయి అధికారులతో నిర్వహించిన గ్రామ, మండల అభివృద్ధి కార్యక్రమాల సమీక్షా సమావేశంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాల అభివృద్ధి పనులు, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణ, గ్రామ పంచాయతీలు ఎదుర్కొంటున్న సమస్యలపై సర్పంచులు, అధికారులను అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో జ్వరాలు, ఇతర సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మంత్రి సూచించారు. గ్రామాల్లో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచడంతో పాటు ప్రజల్లో అవగాహన కల్పించాలని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరమైన మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే తన దృష్టికి తీసుకురావాలని అధికారులకు సూచించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి తక్షణమే పరిష్కరించాలని, అభివృద్ధి పనులను నాణ్యతతో నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతి గ్రామంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో నిర్లక్ష్యం ఉండరాదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామ సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

# సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యేకు కనిపించని ప్రోటోకాల్..!

- **సమీక్షకు హాజరైన మహిళా ప్రజా ప్రతినిధుల భర్తలు**
- **చూసి చూడనట్టు వ్యవహరించిన ఎమ్మెల్యే, అధికారులు**



**దుబ్బాక ప్రతినిధి, జూలై 29, (నవజ్యోతి ప్రతినిధి)**

దుబ్బాక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన మండల అభివృద్ధి సమీక్ష సమావేశం వివాదానికి దారితీసింది. ఈ సమీక్ష సమావేశానికి సర్పంచ్‌లుగా ఎన్నికైన మహిళలకు బదులుగా వారి భర్తలు హాజరయ్యారు. ప్రజాప్రతినిధులుగా ఉన్న మహిళలు రాకుండా పురుషులు రావడంపై అధికారులు, ఎమ్మెల్యే ఎలాంటి అభ్యంతరం వ్యక్తం చేయలేదు. ప్రతి చిన్న కార్యక్రమంలోనూ ప్రోటోకాల్ ఉల్లంఘన జరిగిందంటూ అధికారులపై, నాయకులపై నానా రగడ చేసే ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, తన సొంత సమీక్ష సమావేశంలోనే ప్రోటోకాల్ పాటించకపోవడంపై అందరూ అవాక్కయ్యారు. ఈ వ్యవహారంపై కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా విమర్శించారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో పదవిలో ఉన్న వ్యక్తులనే రావాలని చెప్పే ఎమ్మెల్యే, అధికారులు ఇప్పుడు భర్తలను హక్కున చేర్చుకోవడం ఏమిటని, తమకు నచ్చితే ఒక రకం, నచ్చకపోతే ప్రోటోకాల్ ఉల్లంఘన అంటూ గొడవ చేయడం ఎమ్మెల్యేకు అలవాటైందని కాంగ్రెస్ నాయకులు అసహనం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రోటోకాల్ విషయంలో రెండు నాల్కల ధోరణిని మానుకోవాలని వారు ఎమ్మెల్యేకు హితవు పలికారు. లేదంటే "దొంగనే దొంగ దొంగ అని అరిచినట్టు ఉంటుంది" అంటూ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి వైఖరిపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. మహిళా ప్రజాప్రతినిధుల స్థానంలో వారి భర్తలు చట్టబద్ధంగా జరిగే సమావేశాలకు హాజరు కావడం చట్టాన్ని అపహాస్యం చేయడమేనని, ఈ ధోరణి మారాలని పలువురు ప్రజాస్వామిక వాదులు పేర్కొంటున్నారు.<

# అభివృద్ధికి వారధులు.. ప్రధాన రహదారులు..

**62 లక్షల రూపాయలతో నిర్మిస్తున్న కల్వర్ట్ పనులను పరిశీలించిన బీఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్**

**కుత్బుల్లాపూర్, జూలై 29, (నవజ్యోతి ప్రతినిధి)**

జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని పైప్‌లైన్ రోడ్డుపై రూ.62.00 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మిస్తున్న కల్వర్ట్ నిర్మాణ పనులను బీఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ బుధవారం సంబంధిత అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, అభివృద్ధికి వారధులు ప్రధాన రహదారులే అని పేర్కొన్నారు. గత 12 ఏళ్లలో కోట్లాది రూపాయల నిధులతో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. ప్రజల ప్రయాణ సౌకర్యాన్ని మరింత మెరుగుపరిచే లక్ష్యంతో రానున్న రోజుల్లో కూడా మరిన్ని రహదారులు, మౌలిక వసతుల అభివృద్ధి పనులు చేపడతామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డీఈ సంధ్య, ఏఈలు ఆశా, అభిరామ్, మాజీ కార్పొరేటర్ జగన్, శ్రీ వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవీందర్, కిషోర్, నాయకులు బస్వరాజ్, మెట్ల శ్రీను, బ్రహ్మానంద చారి తదితరులు పాల్గొన్నారు.

# అధికారులు నిర్లక్ష్యం చేస్తే కలెక్టరేట్ ముట్టడి తప్పదు



## దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి హెచ్చరిక

**దుబ్బాక ప్రతినిధి, (నవజ్యోతి ప్రతినిధి)**

దుబ్బాక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో మండల అభివృద్ధిపై సమగ్ర సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మండల సర్పంచులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, మండల, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు. వ్యవసాయం, విద్యుత్, మిషన్ భగీరథ, హౌసింగ్, విద్య, వైద్యం తదితర శాఖల పనితీరును శాఖల వారీగా ఎమ్మెల్యే సమీక్షించారు. సమావేశంలో మాట్లాడిన ఎమ్మెల్యే, ప్రజా సమస్యల పరిష్కారమే ఈ సమీక్షల ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు. రైతులకు యూరియా, డీఏపీ ఎరువుల సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు రాకూడదని ఆదేశించారు. డీఏపీ ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఫిర్యాదులు రావడంతో వెంటనే జిల్లా అధికారులకు ఫోన్ చేసి సంబంధిత దుకాణాలపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పామాయిల్ సాగును ప్రోత్సహించేందుకు తానే స్వయంగా 12 ఎకరాల్లో పామాయిల్ సాగు చేస్తానని ప్రకటించారు. ప్రతి గ్రామంలో విద్యుత్ అంతరాయాలు లేకుండా ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచాలని, తాగునీటి సరఫరా నిరంతరంగా ఉండేలా చూడాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు, వైద్య కేంద్రాల్లో సిబ్బంది కొరతను వెంటనే తీర్చాలని ఆదేశించారు. దుబ్బాక అభివృద్ధి విషయంలో జిల్లా అధికారుల నిర్లక్ష్యాన్ని సహించబోమని ఎమ్మెల్యే హెచ్చరించారు. "ప్రజా సమస్యలు పరిష్కారం కాకపోతే జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తాం. అవసరమైతే ఉద్యమాల గడ్డ దుబ్బాక శక్తి ఏమిటో మరోసారి చూపిస్తాం" అని ఘాటుగా వ్యాఖ్యానించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా రైతులకు సాగునీరు అందుతుండటం కేసీఆర్ దూరదృష్టికి నిదర్శనమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య, అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# భారీ వర్షా లపై జిల్లా పోలీసుల అప్రమత్తత

- వరద ప్రభావిత ప్రాంతాల్లో జిల్లా ఎస్పీ, అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన

**జగిత్యాల జిల్లా ప్రతినిధి, జూలై 29, (నవజ్యోతి ప్రతినిధి)**

జగిత్యాల జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ జిల్లా పోలీసు శాఖ అప్రమత్తంగా వ్యవహరిస్తోంది. ఈ నేపథ్యంలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, అధికారులు వరద ప్రభావిత ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిస్థితిని సమీక్షించారు. అలాగే వాగులు, వంకలు, లోతట్టు ప్రాంతాలు, కల్వర్టులు, నీరు నిలిచే ప్రాంతాల్లో తీసుకోవాల్సిన చర్యలపై టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి ఎస్పీ గారు పోలీసు అధికారులు, సిబ్బందికి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. భారీ వర్షాల కారణంగా జిల్లాలో ఎక్కడైనా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడితే వెంటనే స్పందించి రాకపోకలను పునరుద్ధరించాలని, ప్రమాదకర ప్రాంతాల్లో తాత్కాలిక హెచ్చరిక బోర్డులు, బారికేడ్లు ఏర్పాటు చేసి ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. వరద నీరు ప్రవహిస్తున్న వాగులు, వంకలు, కల్వర్టులను ప్రజలు దాటకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. ఉరుములు, మెరుపుల సమయంలో గ్రామస్తులు అడవి ప్రాంతాలకు వెళ్లకుండా సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృతంగా అవగాహన కల్పించాలని, గోదావరి పరివాహక మండలాల్లో నదీ నీటిమట్టాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ పరిస్థితులను ఉన్నతాధికారులకు నివేదించాలని ఆదేశించారు. వర్షాల సమయంలో చేపల వేట, ఈత, వరద నీటిలోకి వెళ్లడం వంటి ప్రమాదకర చర్యలకు దూరంగా ఉండేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని, గతంలో వరదలతో ప్రభావితమైన ప్రాంతాలపై ప్రత్యేక నిఘా కొనసాగించాలని సూచించారు. ప్రతి పోలీసు వాహనంలో తాళ్లు, లైఫ్ జాకెట్లు, లైఫ్ బోయ్‌లు లేదా టైర్ ట్యూబులు వంటి అత్యవసర రక్షణ సామగ్రిని అందుబాటులో ఉంచాలని, విధుల్లో ఉన్న ప్రతి పోలీసు సిబ్బంది తప్పనిసరిగా రెయిన్‌కోట్లు వెంట తీసుకెళ్లాలని ఆదేశించారు. విద్యుత్ తీగలు తెగిపోవడం, విద్యుత్ స్తంభాలు దెబ్బతినడం వంటి ఘటనలు గుర్తించిన వెంటనే విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించి



తక్షణ చర్యలు తీసుకునేలా సమన్వయం చేయాలని సూచించారు. మూసుకుపోయిన డ్రైనేజీలను రెవెన్యూ శాఖతో సమన్వయం చేసుకొని జేసీబీల సహాయంతో వెంటనే శుభ్రం చేయించి వర్షపు నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.భారీ వర్షాల సమయంలో ప్రజలు అత్యవసరం అయితే తప్ప బయటకు రావద్దని, వాగులు, వంకలు, వరద నీటిని దాటే ప్రయత్నం చేయవద్దని, పిల్లలను నీటి ప్రవాహాల వద్దకు వెళ్లనీయవద్దని కోరారు. ఏదైనా అత్యవసర పరిస్థితి తలెత్తిన వెంటనే స్థానిక పోలీసులకు లేదా డయల్ 100కు సమాచారం అందించాలని సూచించారు.

# కళ్లు లేని కబోధిలా వ్యవహరిస్తున్న ప్రతిపక్షాలు

## ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి

**మానకొండూర్ ప్రతినిధి, జూలై 29, (నవజ్యోతి ప్రతినిధి)**



తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కళ్ల ముందు కదలాడుతున్నా ప్రతిపక్షాలకు కానరాక కళ్లు లేని కబోదిలా వ్యవహరిస్తున్నాయని మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ విమర్శించారు. బుధవారం తిమ్మాపూర్ మండల పరిషత్ సమావేశమందిరంలో వివిధ గ్రామాల 99 మంది లబ్ధిదారులకు 31.92 లక్షల విలువ చేసే సీఎంఆర్ఎఫ్ చెక్కులు ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాలను అమలు చేయని బీఆర్ఎస్, దానికి వంతపాడుతూ అంటకాగిన బీజేపీ పార్టీలు కాంగ్రెస్ పథకాలపై తప్పుడు ప్రచారాలకు పూనుకోవడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాలకు ప్రయోజనం చేకూర్చే విధంగా వివిధ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నప్పటికీ ప్రతిపక్షాలు విమర్శలు చేయడం సిగ్గుచేటని ఆయన విమర్శించారు. గత పాలనలో లక్ష రూపాయల వరకు రుణ మాఫీ చేసి చేతులు దులుపుకున్న విషయాన్ని విస్మరించిన గులాబీ నేతలు 2 లక్షల వరకు రుణ మాఫీ అమలు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం ఆక్షేపణీయమని ఆయన పేర్కొన్నారు. సాంకేతిక కారణాల వల్ల 2 లక్షల రుణమాఫీ పొందడంలో కొద్ది మంది రైతులకు ఆలస్యం జరిగిందే తప్ప మరో ఉద్దేశం కాదని, అర్హులైన వారందరికీ ప్రభుత్వం రుణమాఫీ చేస్తుందని ఆయన స్పష్టం చేశారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇవ్వడం చేతకాని గత పాలకులు ఇందిరమ్మ ఇళ్ల ద్వారా సొంతింటి కలను సాకారం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించడం తగునా అని ఆయన సూటిగా ప్రశ్నించారు. డబుల్ బెడ్ రూమ్ పథకం అమలు కోసం మోదీ ప్రభుత్వ సాయాన్ని కోరాలన్న సోయి అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ లేకుండా పోయిందని ఆయన ఎద్దేవా చేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ బేషజాలను పక్కనబెట్టి జనహితం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలు మార్లు మోడీని కలిసి లక్ష ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరారని ఆయన గుర్తు చేశారు. ఇళ్లు లేని నిరుపేదలకు, ముఖ్యంగా గుడిసెల్లో నివాసం ఉంటున్న వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. ధరణి పేరిట జరిగిన అక్రమాలు అన్నీ,ఇన్నీ కావని, ప్రభుత్వ, ప్రైవేటు భూములు అన్యుల పరమయ్యాయని, భూమల అక్రమణలు, కబ్జాలకు అడ్డూఅదుపూ లేకుండా పోయాయని, వాస్తవాలను ఇప్పటికైనా గ్రహించి బట్టకాల్చి మీద వేసే విధానానికి గులాబీనేతలు స్వస్తిపలకాలని డాక్టర్ కవ్వంపల్లి హితవు పలికారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలకు కట్టుబడి వాటిని అమలు చేస్తున్నదని ఆయన చెప్పారు. ప్రభుత్వ పథకాల వల్ల ప్రతి కుటుంబం నెలకు 2500 రూపాయల మేరకు లబ్ధిపొందుతున్న విషయాన్ని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సోదాహరణంగా వివరించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక అష్టకష్టాలకు, అన్యాయాలకు గురిచేయడం వల్లనే ప్రజలు ఆ పార్టీని కాదని కాంగ్రెస్ పార్టీకి పట్టంగట్టారన్నారు. ప్రజల ఆశలు,ఆశయాలకు అనుగుణంగా పాలన సాగిస్తూ రేవంత్ రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల కళ్లలో ఆనందాన్ని చూస్తున్నదని డాక్టర్ కవ్వంపల్లి పేర్కొన్నారు. రైతులు పండించిన వరి, మక్కజొన్న, సన్ ఫ్లవర్ తదితర పంటలను ప్రభుత్వం ఐకేపీ, సింగిల్ విండో వంటి ప్రభుత్వ సంస్థల ద్వారా కొనుగోలు చేయించడమే కాకుండా 24 గంటలకు రైతులకు డబ్బులు చెల్లించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని ఆయన చెప్పారు. దొడ్డు బియ్యానికి బదులు సన్న బియ్యాన్ని పంపిణీ చేస్తున్నామని, కిలో సన్న బియ్యాన్ని 60 రూపాయలకు ప్రభుత్వం కొనుగోలు చేసిన రేషన్ షాపుల ద్వారా పంపిణీ చేస్తున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ పవన్ కుమార్, తిమ్మాపూర్ తహసీల్దార్ కర్ర శ్రీనివాస్ రెడ్డి, ఎంపీడీవో మల్హోత్రా, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి రమేశ్, నుస్తులాపూర్, పోరండ్ల సింగిల్ విండో చైర్మన్లు మోరపల్లి రమణారెడ్డి, గోపు మల్లారెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ చెన్నబోయిన రవి, పార్టీ నాయకులు దావు సంపత్ రెడ్డి, శ్రీగిరి రంగారావు, తుమ్మనపల్లి శ్రీనివాసరావు,కొత్త తిరుపతిరెడ్డి, గొట్టెముక్కుల సంపత్ రెడ్డి, పోలు రాము, రమేశ్, నోముల అనిల్, కేతిరెడ్డి ఎల్లారెడ్డి, లక్ష్మణ్, తుర్తి అరవింద్, వివిధ గ్రామాల సర్పంచులు, పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ ఓబీసీ మోర్చా మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శిగా వర్కల రాజేందర్ గౌడ్

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి (ఉప్పల్), జూలై 29, (నవజ్యోతి ప్రతినిధి)**

భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా మేడ్చల్ మల్కాజిగిరి అర్బన్ జిల్లా కార్యదర్శిగా నియమించిన సందర్భంగా ఉప్పల్ బీజేపీ సీనియర్ నాయకులతో కలిసి బీజేపీ ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్విఎస్ఎస్ ప్రభాకర్ కు మేడ్చల్ జిల్లా అధ్యక్షులు మల్లారెడ్డికి ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు శేఖర్ యాదవ్ కు బుధవారం ధన్యవాదములు తెలిపారు. అలాగే ఈ బాధ్యత రావడానికి కృషి చేసిన బీజేపీ సీనియర్ నాయకులు గొరిగే కృష్ణకు, మహంకాళి లక్ష్మణ్ ముదిరాజ్ కు, రావుల బాలకృష్ణగౌడ్ కు, ఉప్పల్ మాజీ బీజేపీ అధ్యక్షులు రెడ్డిగారి దేవేందర్ రెడ్డిలకు ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎల్లగొని ప్రకాష్ గౌడ్, బౌరంపేట మురళి కృష్ణ ముదిరాజ్, సింగారం కార్తీక్, శ్రీరాం జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



# జగద్గిరిగుట్ట డివిజన్‌లో అభివృద్ధి పనులను పరిశీలించిన మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్



**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, జూలై 29, (నవజ్యోతి ప్రతినిధి)**

జగద్గిరిగుట్ట డివిజన్‌లోని దేవమ్మ బస్తీలో సుమారు ₹30 లక్షల వ్యయంతో చేపడుతున్న వాటర్ పైప్‌లైన్, భూగర్భ డ్రైనేజీ అభివృద్ధి పనులను మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్ బుధవారం స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కోరారు. తాను కార్పొరేటర్‌గా ఉన్న సమయంలో డివిజన్‌లో కోట్లాది రూపాయలతో పలు అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేశామని తెలిపారు. ముఖ్యంగా తాగునీటి సరఫరా, భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ, సీసీ రోడ్లు వంటి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చినట్లు పేర్కొన్నారు. పదవీకాలం ముగిసినప్పటికీ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని కొలుకుల జగన్ అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు డీఈ సంధ్య, ఏఈ లు అభిరామ్, ఆశ, మాజీ డివిజన్ అధ్యక్షులు మల్లేష్ గౌడ్, మహేందర్, వినయ్, హనుమంతు, బ్రహ్మానంద చారి, ముంతాజ్, యాదగిరి, మనోజ్, ఖలీల్, అంజన్ యాదవ్, గోరేమియా తదితరులు పాల్గొన్నారు.

# వర్షాలతో పులకించిన అన్నదాతలు.. జోరందుకున్న వరినాట్లు..

- యూరియా కోసం క్యూలైన్లలో రైతులు
- యూరియా వాడకం తగ్గించాలని సూచిస్తున్న వ్యవసాయ అధికారులు
- పంటలకు సేంద్రియ ఎరువులు, నానో యూరియా మేలని వెల్లడి



దుబ్బాక ప్రతినిధి, జూలై 29, (నవజ్యోతి ప్రతినిధి)

గత నెల రోజులుగా ఎదురు చూస్తున్న రైతులకు ఇటీవల కురుస్తున్న వర్షాలకు అన్నదాతల్లో కొత్త ఉత్సాహం నెలకొంది. మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు దుబ్బాక నియోజకవర్గ వ్యాప్తంగా వరి నాట్లు వేగం పుంజుకున్నాయి. జూన్‌లో వర్షాలు సరిగా కురవకపోవడంతో సాగు చేయాలా వద్దా అని సందిగ్ధంలో ఉన్న అన్నదాతలు, ఇప్పుడు వర్షాన్ని చూసి ధైర్యం తెచ్చుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అన్నదాతలు వర్షంలోనే పొలం పనుల్లో నిమగ్నమయ్యారు. నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో ప్రతి గ్రామంలోనూ సాగు సందడి కనిపిస్తోంది. ఒకవైపు ట్రాక్టర్లు, కల్టివేటర్లతో భూములు దున్నుతుండగా, మరోవైపు మహిళా రైతులు గుంపులుగా వరి నాట్లు వేస్తున్నారు. జోరు వానలు కురిసి చెరువులు, కుంటలు నిండాలంటూ వరుణ దేవుడిని వేడుకుంటున్నారు. అయితే సాగుతో పాటు యూరియా కోసం రైతులు పడుతున్న ఇబ్బందులు మళ్లీ మొదలయ్యాయి. ఎరువుల దుకాణాల వద్ద రైతుల రద్దీ పెరిగింది. ఎక్కడ స్టాక్ వస్తుందో తెలుసుకుని ఆన్‌లైన్‌లో ముందుగానే బుక్ చేసుకుని ఆయా దుకాణాలకు రైతులు పరుగులు పెడుతున్నారు. వర్షాలు కురుస్తున్నాయి కానీ యూరియా దొరకపోతే ఏంలాభం అంటూ.. ప్రభుత్వం వెంటనే అదనపు స్టాక్ పంపించాలని రైతులు కోరుతున్నారు. గత ఏడాది యూరియా కోసం రైతులు పడిన కష్టాలు మళ్లీ రావద్దని, సరిపడా నిల్వలు ఉంచాలని అన్నదాతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

గత మూడు రోజులుగా వర్షాలు కురవడంతో దుబ్బాక, మిరుదొడ్డి, తొగుట, దౌల్తాబాద్, రాయపోలు, అక్బర్ పేట-భూంపల్లి మండలాలలో రైతులు ఎల్-నినో ప్రభావాన్ని మర్చిపోయి, వరి నాట్ల వైపే మొగ్గు చూపుతున్నారు. గత నెల రోజులుగా వ్యవసాయ అధికారులు గ్రామాల్లో ఎల్-నినోపై అవగాహన కల్పించినప్పటికీ రైతులు మాత్రం పెడచెవిన పెట్టినట్లు కనిపిస్తుంది.

★ ఎల్ నినో ప్రభావం.. రైతులకు అధికారుల సూచన..

ఈ ఏడాది ఎల్-నినో ప్రభావంతో వర్షపాతం తక్కువగా ఉండే అవకాశం ఉందని మిరుదొడ్డి వ్యవసాయ అధికారి మల్లేశం తెలిపారు. వరికి బదులుగా మొక్కజొన్న, కంది, పెసర, ఆయిల్ ఫామ్ వంటి ఆరుతడి పంటలను ఎంచుకోవాలన్నారు. నీటి వినియోగంలో పొదుపు పాటించడంతో పాటు బిందు సేద్యం, తుంపర సేద్యాన్ని వినియోగించుకోవాలని సూచించారు. పంటలకు యూరియా వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులతో పాటు నానో యూరియాను వాడాలని తెలిపారు. అధిక యూరియా వాడకం వల్ల భూసారం దెబ్బతింటుందని వెల్లడించారు. రైతులు అవసరానికి మించి ఎక్కువ మోతాదులో యూరియా వాడవద్దన్నారు. అన్నదాతలు వ్యవసాయ అధికారుల సూచనలు తీసుకొని పంటలకు పెస్టిసైడ్ మందులను వాడాలని సూచించారు.

# మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, జూలై 29, (నవజ్యోతి ప్రతినిధి)**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి తాడేపల్లిలోని మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వై . ఎస్ . జగన్ మోహన్ రెడ్డి నివాసంలో మంగళవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర్ రావు మరియు మాజీ ముఖ్యమంత్రి వై. ఎస్. జగన్ మోహన్ రెడ్డి కలిసి దిగిన అరుదైన ఫోటోతో రూపొందించిన అందమైన ఫ్రేమ్‌ను జ్ఞాపికగా బహుకరించారు. ఆ ఫ్రేమ్‌ను ఆసక్తిగా పరిశీలించిన జగన్ మోహన్ రెడ్డి హర్షం వ్యక్తం చేస్తూ, జ్ఞాపికను అందించిన నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి మరియు బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తెలంగాణ సాయి తదితరులు పాల్గొన్నారు.



# అతి పెద్ద ధాన్యాం నిల్వ గోదాం నిర్మాణానికి భూమిని కేటాయించండి...

- కలెక్టర్ కు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ప్రతినిధుల విజ్ఞప్తి....

**రామాయంపేట, (నవజ్యోతి ప్రతినిధి)**



నిజాంపేట మండలం కల్వకుంట ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో ప్రపంచంలోనే అతిపెద్ద ధాన్య నిల్వ పథకం కింద నేషనల్ కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (NCDC) సహకారంతో రెండు వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల ఆధునిక గోదాం నిర్మాణానికి అనుమతి మంజూరు చేయాలని కోరుతూ మెదక్ జిల్లా కలెక్టర్‌కు సంఘం ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఈ ప్రతిష్ఠాత్మక పథకం ద్వారా రైతులకు శాశ్వత నిల్వ సౌకర్యం కల్పించడం, వ్యవసాయ ఉత్పత్తులను సురక్షితంగా నిల్వ చేయడంతో పాటు మార్కెట్ ధరలు అనుకూలంగా ఉన్న సమయంలో విక్రయించే అవకాశం కలుగుతుందని వివరించారు. దీనివల్ల రైతులకు గిట్టుబాటు ధర లభించడమే కాకుండా మధ్యవర్తులపై ఆధారపడాల్సిన అవసరం కూడా తగ్గుతుందని పేర్కొన్నారు. సంఘానికి చెందిన సర్వే నంబర్లు 932/ఎ, 932/బి, 933 పరిధిలో రెండు వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాం నిర్మించేందుకు అవసరమైన అనుమతులు మంజూరు చేసి, సంబంధిత శాఖల అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేయాలని కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు. ఈ గోదాం నిర్మాణం పూర్తయితే పరిసర గ్రామాల రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉండటంతో పాటు పంటల నిల్వ, నాణ్యత పరిరక్షణ, వ్యవసాయ మార్కెటింగ్ వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని సంఘం ప్రతినిధులు ఆశాభావం వ్యక్తం చేశారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ ప్రతిపాదనకు జిల్లా యంత్రాంగం సానుకూలంగా స్పందించి త్వరితగతిన అనుమతులు మంజూరు చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

# సేంద్రియ రైతు రంగ రాజ కిషన్ ను సన్మానించిన కలెక్టర్ ప్రతిమసింగ్

- గత కొన్నేళ్లుగా సేంద్రియ విధానంలో పంట...
- యూరియా వాడకుండా పంట అధిక దిగుబడి.
- ఏడాదిలో ఒకే పంట పండిస్తున్న వైనం.
- అన్నదాతలకు ఆదర్శంగా నిలుస్తున్న సేంద్రియ రైతు.

**రామాయంపేట, (నవజ్యోతి ప్రతినిధి)**



యూరియా వాడకుండా కేవలం సేంద్రియ పద్ధతుల ద్వారా వరి పంటను పండిస్తూ, అధిక దిగుబడిని సాధిస్తూ, ప్రస్తుత సమాజంలో రైతులకు ఆదర్శంగా నిలిచిన సేంద్రియ రైతును కలెక్టర్ గుర్తించారు. వివరాలకు వెళ్తే.. రైతు నేస్తం కార్యక్రమం 100 వ ఎపిసోడ్ సందర్భంగా రామాయంపేట పట్టణంలోని రైతు వేదికలో మంగళవారం నాడు జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ ప్రతిమ సింగ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమం అనంతరం కలెక్టర్ పలువురు రైతులను సన్మానించారు . ఇందులో భాగంగా నిజాంపేట మండల పరిధిలోని కల్వకుంట గ్రామానికి చెందిన సేంద్రీయ రైతు రంగ రాజకిషన్ నాలుగేళ్లుగా సేంద్రీయ విధానం లో సాగు చేస్తున్నారు. ఈ విషయాన్ని రామాయంపేట మండల వ్యవసాయ అధికారి సోమలింగా రెడ్డి, ఇతర అధికారులు కలెక్టర్ ప్రతామాసింగ్ధృ ష్టికి తీసుకెళ్లారు. దీంతో కలెక్టర్ వెంటనే స్పందించి సేంద్రియ విధానములో పంటను సాగు చేస్తూ, పలువురు రైతులకు ఆదర్శంగా నిలుస్తున్న రంగ రాజ కిషన్ ను వేదికపైకి పిలిచి ఘనంగా సన్మానించారు. అయితే ప్రస్తుతం రాజకిషన్ మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావుకు పర్సనల్ సెక్రెటరీగా పనిచేస్తున్నారు. కలెక్టర్ ప్రతిమసింగ్ రాజ కిషన్ ను సన్మానించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. వారిలో టీయూడబ్ల్యూజే (ఐజెయు) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డి.జి. శ్రీనివాస శర్మ, జిల్లా కోశాధికారి వుడెం దేవరాజు, రామాయంపేట ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు బసన్నపల్లి మల్లేశం, ప్రధాన కార్యదర్శి పటేరీ రాము, కల్వకుంట గ్రామానికి చెందిన చింతల స్వామి ఉన్నారు.

# మంజీరా జలాలు కలుషితం?





- పరిశ్రమల కాలుష్య జలాలు మంజీరలోకి
- కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు ఫిర్యాదు
- కలుషిత జలాల శాంపిల్‌లు ల్యాబ్‌కు....
- చర్యలు తీసుకోవాలంటు శివ్వంపేట గ్రామస్తుల డిమాండ్

**జోగిపేట,జూలై 29, (నవజ్యోతి ప్రతినిధి):**

సంగారెడ్డి జిల్లా చౌటకూర్ మండలం పరిధిలోని శివంపేట సమీపంలోని చార్మినార్ బ్రూవరీస్ పరిశ్రమ ద్వారా కాలుష్య జలాలు మంజీరా నదిలోకి వెళ్లడం వల్ల జలాలు కలుషితమై ప్రాణాంతంగా మారుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. పరిశ్రమ నుంచి వ్యర్థ జలాలను పైపుల ద్వారా మంజీరా నదిలోకి వదులుతున్నారని శివ్వంపేట గ్రామస్తులు జిల్లా ఉన్నతాధికారులు, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు ఫిర్యాదు చేశారు. ఏళ్ల తరబడి కలుషిత జలాలతో పశువులు అనారోగ్యానికి గురై క్షీణించి మృత్యువాత పడ్డాయి. అంతే కాకుండా చేపలు కూడా శివారు ప్రాంతాల్లో చనిపోయిన సందర్భాలున్నాయి. ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నా ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోగా యాజమాన్యానికి వంతపాడుతున్నారన్న ఆరోపణలున్నాయి.

**కాలుష్య నియంత్రణ మండలి అధికారుల చర్యలేవీ?**

కాలుష్య బాధితులు సంబంధిత కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు ఆ«ధారాలతో సహ ఫిర్యాదులు చేసి వారం రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. కాలుష్య నియంత్రణ మండలి అధికారులు పరిశ్రమను పరిశీలించి, నీటి నమూనాలను సేకరించి ప్రయోగశాలకు పంపించినట్లు తెలుస్తుంది. సేకరించిన నీటి నమూనాలను ప్రయోగశాలకు పంపినా వచ్చే నివేదిక కోసం అధికారులు ఎదురు చూస్తున్నట్లు చెబుతున్నారు. ఏళ్ల తరబడి సంబంధిత శాఖ అధికారులకు ఫిర్యాదులు అందుతున్నా చర్యలు మాత్రం శూన్యమేనని చెప్పొచ్చు.

**గ్రామస్తులు, కార్మికుల మధ్య భిన్నాభిప్రాయాలు**

పరిశ్రమ ద్వారా మంజీర నీరు కలుషితం అవుతుందని, పశువులు, చేపలు మరణిస్తున్నాయని, మనుషులు అనారోగ్యానికి గురవుతున్నారని గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదులు చేస్తుంటే పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులు మాత్రం భిన్నాభిప్రాయాలను వ్యకం చేస్తున్నారు. పరిశ్రమలో అత్యాధునిక ఈటీపీ (వ్యర్థ జల శుద్ధి కేంద్రం) ఏర్పాటు చేసి, శుద్ధి చేసిన నీటినే నిబంధనల మేరకు నిర్వహిస్తున్నామని వాదిస్తున్నారు. వర్షాల కారణంగా బయటకు వెళ్లింది కేవలం వర్షపు నీరేనని, పరిశ్రమ వ్యర్థ జలాలను మంజీరా నదిలోకి విడుదల చేస్తున్నారనే ప్రచారం వాస్తవం కాదని స్పష్టం చేస్తున్నారు. కాలుష్య ఆరోపణల ప్రభావంతో పరిశ్రమ ఉత్పత్తి తగ్గిందని, తమ ఉపాధి ప్రమాదంలో పడుతోందని కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**మంజీర జలాలు కలుషితం చేస్తే ఊరుకోం**

మంజీర జలాలను కలుషితం చేసే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని గ్రామస్తులు స్పష్టం చేస్తున్నారు. కాలుష్య నియంత్రణ మండలి ప్రయోగశాల నివేదికను త్వరగా విడుదల చేసి, అందులో వెల్లడయ్యే వాస్తవాల ఆధారంగా బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. మంజీర జలాలు కలుషితం అవుతున్నాయా? లేదా అనే విషయం కాలుష్య నియంత్రణ మండలి ప్రయోగశాల ఇచ్చే నివేదిక వెలువడిన తర్వాతే తెలుస్తుంది.

# మైనర్ బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన నిందితుడికి రెండేళ్ల కఠిన శిక్ష

- ఓటరు జాబితా సవరణను పారదర్శకంగా చేపట్టాలి బిజెపి జిల్లా అధ్యక్షుడు

**వెల్దుర్తి,జులై 29 (నవజ్యోతి ప్రతినిధి):**



వెల్దుర్తి మండల కేంద్రంలో పాటు అన్ని గ్రామాల్లో కొనసాగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియను మెదక్ జిల్లా అధ్యక్షుడు మల్లేష్ గౌడ్ కుక్కునూరు గ్రామంలో పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులతో ప్రక్రియ పురోగతిపై సమీక్ష నిర్వహించారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో నమోదు అయ్యేలా, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా నిబంధనలకు అనుగుణంగా పారదర్శకంగా సవరణ ప్రక్రియ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటరు జాబితా అత్యంత కీలకమైందని, ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించేలా బాధ్యతాయుతంగా ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దాసు, జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటేశం, నాయకులు శివ ఉప సర్పంచ్ నవీన్, మండల నాయకుడు విశ్వేశ్వర్, బూత్ అధ్యక్షులు నాగభూషణం, మహేష్ గౌడ్,బీజేవైఎం నాయకుడు నవీన్, తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి వివేక్ వెంకటస్వామిని కలిసిన సర్పంచ్ శ్రీహరి..

**సంగారెడ్డి, జూలై 29, (నవజ్యోతి ప్రతినిధి)**



రాష్ట్ర గనులు, భూగర్భ వనరుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామిని గుండ్ల మాచునూర్ గ్రామ సర్పంచ్ శ్రీహరి బుధవారం హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. అనంతరం గ్రామ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లడంతో పాటు వినతి పత్రాన్ని సమర్పించారు. గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు, పెండింగ్ అభివృద్ధి పనులకు సహకరించాలని , మినీ స్టేడియం కొరకు కోరారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించి, సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు సర్పంచ్ శ్రీహరి తెలిపారు.

# గురు పౌర్ణమి పూజల్లో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



**సంగారెడ్డి, జూలై 29 (నవజ్యోతి ప్రతినిధి):**

పవిత్ర గురు పౌర్ణమి సందర్భంగా సంగారెడ్డి పట్టణంలోని 9వ వార్డులో వెలసిన గురు దత్తాత్రేయ సహిత సాయిబాబా దేవాలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఎమ్మెల్యేకు వేద మంత్రోచ్చారణల మధ్య పూర్ణకుంభ స్వాగతం పలికి, ప్రత్యేక ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా చింతా ప్రభాకర్ మాట్లాడుతూ.. భారతీయ సంస్కృతిలో గురువుకు అత్యున్నత స్థానం ఉందని, గురువులను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. గురు పౌర్ణమి పర్వదినం ప్రతి ఒక్కరిలో ఆధ్యాత్మిక చింతనను పెంపొందించాలని, భగవంతుని ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ విజేందర్ రెడ్డి, కౌన్సిలర్ లాడే మల్లేశం, 9వ వార్డు బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జి లాడే బాలు, సీనియర్ నాయకులు వేణుగోపాల స్వామి, పట్టణ కూర్మ సంఘం అధ్యక్షులు మల్లేశం, లాడే వెంకటేశం, మండల పార్టీ అధ్యక్షులు మధుసూదన్ రెడ్డి, విఠల్, కార్యదర్శి గోవర్ధన్ రెడ్డి, లక్ష్మారెడ్డి, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కొంపల్లి డివిజన్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ లావణ్య గారికి కలిసిన బిజెపి నాయకులు .

## నూతన పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని వినతిపత్రం ఇచ్చిన కొంపల్లి బిజెపి నాయకులు.



**కొంపల్లి.జులై.29 (నవజ్యోతి ప్రతినిధి)**

కొంపల్లి డివిజన్ లో ఎస్ఐఆర్ యొక్క క్షేత్రస్థాయిలో పనితీరు ఎస్ఐఆర్ ఫిర్యాదు పత్రాల సమీకరణల గురించి అదేవిధంగా వానాకాలం రావడం వలన అనేక కాలనీ వాటర్ సమస్య గురించి అనేక అంశాల పై బుధవారం నాడు కొంపల్లి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ లావణ్య తో చర్చించడం జరిగింద.కొంపల్లి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఉపాధ్యక్షుడు రాజిరెడ్డి. కిసాన్ మోర్చా అధ్యక్షుడు మల్లారెడ్డి.ముఖ్యఅతిథిగా రావడం జరిగింది. కొంపల్లిలో పోలింగ్ స్టేషన్ లో సర్కిల్లో తక్కువ ఉండడం వల్ల ఓటర్స్ లు ఓటు వినియోగించుకోవడం వలన గత ఎమ్మెల్యే.ఎంపీ ఎలక్షన్ లో ఓటింగ్ శాతం తగ్గడం జరిగిందని.మరియు రాబోయే కార్పొరేటర్ ఎలక్షన్స్ దృష్టిలో పెట్టుకొని నూతన పోలింగ్ స్టేషన్స్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని లావణ్యతో చర్చించడం జరిగింది. స్పందించా ఆమె పరిశీలిస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి మహిళా మోర్చా అధికార ప్రతినిధి సరిత రావు.జిల్లా కౌన్సిల్ సభ్యుడు జనార్ధన్ రెడ్డి.కొంపల్లి డివిజన్ అధ్యక్షులు సతీష్ సాగర్. మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా సీనియర్ నాయకులు కొంపల్లి భూక్య శంకర్ నాయక్.కొంపల్లి డివిజన్ నాయకులు మహేందర్ సాగర్.శ్రీకాంత్ గౌడ్.సతీష్.ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది అనంతరం శ్రీ సంత్ గురు రవిదాస్ జయంతి సందర్భంగా కొంపల్లి కమ్యూనిటీ హాల్లో వారి చిత్రపటానికి పూలమాలవేసి జయంతి ఉత్సవం నిర్వహించడం జరిగింది.



# ప్లేట్ లెట్ల కౌంట్ పెంచే జ్యూస్ లు ఇవే..

డెంగ్యూ ఫీవర్ ప్రస్తుతం వెరీ కామన్ అయిపోయింది. నిత్యం ఆస్పత్రులో ఎంతో మంది డెంగ్యూ బారిన పడుతున్నారు. ప్లేట్ లైట్ల కౌంట్ తగ్గితే రోజుల తరబడి ఆస్పత్రుల్లో ఉండాల్సిన పరిస్థితి. అయితే ఇంతకంటే ముందుగానే కొన్ని రకాల జ్యూస్‌లను తాగడం ద్వారా కూడా ప్లేట్ లెట్ల సంఖ్యను వీలైనంత త్వరగా పెంచుకోవచ్చు.

**బొప్పాయి ఆకు రసం:**

బొప్పాయి ఆకు రసం డెంగ్యూ సమయంలో ప్లేట్‌లెట్ల సంఖ్యను పెంచడానికి అత్యంత ప్రభావవంతమైన ఔషధంగా పరిగణించబడుతుంది. బొప్పాయి ఆకుల్లో ఉండే ఎంజైమ్‌లు ప్లేట్‌లెట్లను పెంచడంలో సహాయపడతాయి. ఇది యాంటీఆక్సిడెంట్లను కలిగి ఉంటుంది. అంతే కాకుండా ఇది శరీరం యొక్క రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడానికి, ప్లేట్‌లెట్ల సంఖ్యను పెంచడానికి సహాయపడుతుంది. బొప్పాయి ఆకుల రసం తయారు చేయడానికి తాజా బొప్పాయి ఆకులను కడిగి వాటి నుండి రసాన్ని తీయండి. రోజుకు రెండుసార్లు దీనిని త్రాగండి. ఇది చేదుగా ఉంటుంది. కానీ దీని వల్ల ఈజీగా ప్లేట్ లేట్స్ సంఖ్య పెరుగుతుంది.

**కలబంద రసం:**

అలోవెరా చర్మానికి, జుట్టుకు మాత్రమే కాకుండా డెంగ్యూ పేషెంట్లకు కూడా చాలా ఉపయోగపడుతుంది. ఇది శరీరం యొక్క రోగ నిరోధక శక్తిని బలపరుస్తుంది. అంతే కాకుండా రక్త కణాలను పెంచడంలో దోహదం చేస్తుంది. ఇందులో విటమిన్లు, మినరల్స్ పుష్కలంగా ఉన్నాయి. ఇవి డెంగ్యూతో పోరాడటానికి సహాయపడతాయి. తాజా కలబంద ఆకుల నుండి గుజ్జును తీసి రసాన్ని తయారు చేసి రోజుకు ఒకటి లేదా రెండు సార్లు త్రాగాలి. మీకు కావాలంటే, దాని రుచి కోసం తేనెను కూడా కలుపుకోవచ్చు.

**దానిమ్మ రసం:**

దానిమ్మలో విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి. ఇవి శరీరంలో ప్లేట్‌లెట్స్ సంఖ్యను పెంచడంలో సహాయపడుతుంది. డెంగ్యూ సమయంలో బలహీనతను అధిగమించడానికి, శక్తిని పెంచడానికి దానిమ్మ రసం మంచి ఎంపిక. తాజా దానిమ్మపండు గింజల నుంచి రసాన్ని తీసి ఉదయం, సాయంత్రం క్రమం తప్పకుండా త్రాగాలి. ఇది శరీరానికి అవసరమైన పోషకాలను అందిస్తుంది. అంతే కాకుండా ప్లేట్‌లెట్స్ కౌంట్ పెంచుతుంది.

**క్యారెట్ , బీట్‌రూట్ జ్యూస్:**

క్యారెట్ , బీట్‌రూట్ రెండూ రక్తాన్ని శుభ్రపరుస్తాయి. కొత్త రక్త కణాల ఉత్పత్తిని ప్రోత్సహిస్తాయి. వాటి జ్యూస్‌ని తాగడం వల్ల ప్లేట్‌లెట్స్ కౌంట్ పెరిగి, శరీరంలో రక్త ప్రసరణ మెరుగుపడుతుంది. క్యారెట్ , బీట్‌రూట్‌లను కడిగి చిన్న ముక్కలుగా కట్ చేసి మిక్సీలో మెత్తగా జ్యూస్‌గా చేసుకోవాలి. ఈ జ్యూస్‌ని రోజుకు ఒకసారి తాగండి. దీన్ని తాగడం వల్ల ప్లేట్‌లెట్స్ పెరగడమే కాకుండా శరీరానికి అవసరమైన విటమిన్లు, మినరల్స్ అందుతాయి.





# మటన్ కర్రీ.. ఇలా చేస్తే అదిరిపోతుంది ..!

**తెలంగాణ లో దసరా ఎంతో ఘనంగా నిర్వహిస్తారన్న విషయం తెలిసిందే. ఇక అతి పెద్ద పండగ అయిన దసరా రోజున ప్రతి ఇంట్లోనూ మటన్ కర్రీ పక్కా ఉంటుంది. పేద, ధనిక అనే తేడా లేకుండా ఆ రోజు అందరూ మటన్ కర్రీ చేసుకొని ఇష్టంగా తింటారు. అయితే అసలు మటన్ కర్రీ రుచికరంగా ఎలా చేయాలో ఒకసారి చూద్దాం..**

**కావాల్సిన పదార్థాలు:**

**కేజీ మటన్**
**నాలుగు చెంచాల నూనె**
**ఒక పెద్ద ఉల్లిగడ్డ**
**రెండు చెంచాల కారం ( రుచికి అనుగుణంగా కొంచెం ఎక్కువ కూడావేసుకోవచ్చు)**
**పావు చెంచా పసుపు**
**ఒక కప్పు పెరుగు**
**రెండు చెంచాల అల్లం వెల్లుల్లి పేస్ట్**
**ఒక చెంచా ధనియాల పొడి**
**ఒక చెంచా గరం మసాలా పొడి**
**తగినంత ఉప్పు**
**నాలుగు చెంచాల కొబ్బరిపొడి**
**రెండు చెంచాల గసగసాలు**
**కొద్దిగా కొత్తిమీర**

మటన్ మసాలా కర్రీ తయారు చేసుకోవడానికి ముందుగా కొబ్బరిపొడి, గసగసాలను కొద్దిగా వేయించుకొని, మిక్సీలో వేసి ముద్దగా చేసుకొని పక్కన పెట్టుకోవాలి. అనంతరం స్టవ్ ఆన్ చేసుకొని నాలుగు చెంచాల నూనె వేసుకోవాలి. నూనె కాగిన తరువాత అందులో సన్నగా తరిగి పెట్టుకున్న ఉల్లిగడ్డను వేసుకోవాలి. ఆ ఉల్లిగడ్డ బంగారు వర్ణంలో మారేంత వరకు వేయించుకోవాలి. అనంతరం.. అందులోనే పసుపు, అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసుకొని, వాటికి సంబంధించిన పచ్చి వాసన పోయేంత వరకు బాగా కలుపుకోవాలి.

అనంతరం శుభ్రంగా కడిగి పెట్టుకున్న కేజీ మటన్ ను ఆ మిశ్రమంలో వేసి.. అందులోనే కారం, ఉప్పు, ధనియాల పొడి వేసుకోవాలి. మిశ్రమం మొత్తం మటన్ కు బాగా పట్టేలా కలిపి, ఒక పదినిమిషాల పాటు సన్నటి మంట మీద ఉడికించుకోవాలి. పది నిమిషాల తరువాత కుక్కర్ మూత తీసేసి, కర్రీలో పైన పేర్కొనబడిన మోతాదులో పెరుగు, ముందుగా చేసిపెట్టుకున్న కొబ్బరి పేస్ట్, గరం మసాలా కలుపుకొని మూడు నిమిషాల పాటు ఉడికించుకోవాలి. అనంతరం కర్రీకి సరిపడేంత నీళ్లు పోసుకొని.. కుక్కర్ మూత పెట్టేసి మటన్ ఉడికేంత వరకు ఉడికించుకోవాలి. అనంతరం కుక్కర్ మూత తీసేసి కొత్తిమీర గార్నిష్ చేసుకుంటే సరి.



# ఈ రైస్ చాలా రిచ్ గురు..

బాస్మతి బియ్యం అత్యంత ఖరీదని అంతా అనుకుంటూ ఉంటారు. కానీ బాస్మతి కంటే ఖరీదైన బియ్యం కూడా ఉన్నాయి. బాస్మతి రైస్ ఎలాగైతే బిర్యానీ కోసం వాడతారో.. ఈ ఖరీదైన బియ్యం కూడా బిర్యానీ కోసమే వాడతారు. అసలు అత్యంత ఖరీదైన ఆ బియ్యం ఎక్కడ పండిస్తారు? దాని విశేషాలు ఏమిటో తెలుసుకుందాం.. హస్సావి రైస్ ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన బియ్యం. దీని ధర కిలోకు 50 సౌదీ రియాల్స్. దానిని భారత రూపాయిలకు మార్చితే 1000 నుండి 1500 రూపాయలు! ప్రజలు 3040 రియాళ్లకు (దాదాపు రూ. 800) కొనుగోలు చేసే హస్సావి బియ్యం సగటు నాణ్యతతో ఉంటాయి. అరబ్ దేశాల్లో ఈ బియ్యాన్ని బిర్యానీ చేయడానికి ఉపయోగిస్తారు. చాలా మంది దీనిని రెడ్ రైస్ అని కూడా పిలుస్తారు. ఈ వరి చాలా వేడి వేసవిలో పండిస్తారు మరియు నవంబర్‌డిసెంబర్లో పండిస్తారు. ఈ వరిని పండించాలంటే చాలా శ్రమపడాలి. ఈ వరి మొక్క ఇతర వరి మొక్కల మాదిరిగానే పెరుగుతుంది. ఈ వరి పంటకు వారంలో ఐదు రోజులు మాత్రమే నీరు అవసరం. ముసలివాడు ఈ అన్నం తింటే యవ్వనస్తుడు అవుతాడు అంటారు.





# పండగ షాపింగ్ చేస్తున్నారా? ఈ టిప్స్ పాటించండి

**దసరా పండగ దగ్గరకు వచ్చింది. చిన్నా పెద్దా అనే తేడాలేకుండా ఈ పండగ రోజూ అందరూ కొత్త బట్టలు కొనుక్కోవడం కామన్. అయితే పండగ షాపింగ్ చేసేటప్పుడు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి.. బట్టల ఎంపికలో ఎలాంటి టిప్స్ పాటించాలో ఇప్పుడు తెలుసుకుందాం..**

**ఇలా చేస్తే డబ్బు ఆదా.. !**

పండగ షాపింగ్ చేసేటప్పుడు కొంత బడ్జెట్ ముందే నిర్ణయించుకొని.. ఆ బడ్జెట్ లోనే కొనుగోలు చేసుకోవడం బెటర్. దగ్గర తగినంత డబ్బు ఉంటే మాల్‌లో ఖర్చు చేయడానికి అభ్యంతరం ఉండదు. కానీ తక్కువ డబ్బుతో పొదుపుగా షాపింగ్ చేయడం నిజమైన ప్రతిభ. కొన్ని ముఖ్యమైన షాపింగ్ చిట్కాలను తెలుసుకోవడం వల్ల డబ్బును ఆదా చేసుకోవచ్చు. మీరు వాటిని పాటిస్తే తక్కువ డబ్బుతో షాపింగ్ చేసుకోవచ్చు.

హడావుడి వద్దు

హడావుడిగా షాపింగ్ చేయకండి. తీరికగా ఓపికగా షాపింగ్ చేస్తే ఏది కొనాలి, ఏది కొనకూడదు అని ఆలోచించగలుగుతారు. ఇలా చేయడం వల్ల అవసరమైన వస్తువులనే కొనుగోలు చేస్తారు. షాపింగ్‌కు వెళ్లే ముందుగా లిస్ట్ తయారు చేసుకోండి.. ఇంటి నుండి బయటకు వెళ్ళే ముందు మీ వద్ద వస్తువుల జాబితా ఉందా లేదా అని తనిఖీ చేయండి.

**బట్టలతో పాటు వస్తువులు కొంటున్నారా?**

మీరు కొన్ని వస్తువులను మార్కెట్లో చూడగానే వెంటనే కొనాలని భావిస్తుంటారు. ఈ అలవాటు మీ నెలవారీ బడ్జెట్‌ను పాడు చేస్తుంది. మాల్స్‌లోని దుకాణదారులు అలాంటి వస్తువులను తమ ముందు అలంకరిస్తుంటారు. తద్వారా కస్టమర్లు వాటిని కొనుగోలు చేయడానికి ఇష్టపడుతుంటారు. అలా కాకుండా మీరు ఇప్పటికే నిర్ణయించిన వస్తువులను మాత్రమే కొనుగోలు చేయడం మంచిది.





# పెళ్లిచూపులు మూవీకి పదేళ్లు

## దర్శకుడిగా తరుణ్ భాస్కర్‌కు హిట్

### నటులుగా విజయ్ దేవరకొండ, రీతూవర్మలకు గుర్తింపు

తెలుగు సినీ పరిశ్రమలో చిన్న సినిమాగా విడుదలై సంచలన విజయాన్ని అందుకున్న 'పెళ్లిచూపులు' విడుదలై జులై 29 పదేళ్లు పూర్తి చేసుకుంది. విజయ్ దేవరకొండ, రీతూ వర్మ జంటగా నటించిన ఈ రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ 2016లో విడుదలై బాక్సాఫీస్ వద్ద ఘన విజయాన్ని అందుకోవడమే కాకుండా, తెలుగు సినిమా చరిత్రలో ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది. దర్శకుడిగా తరుణ్ భాస్కర్ పరిచయమైన ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాత డి. సురేశ్ బాబు సమర్పణలో రాజ్ కందుకూరి, యష్ రంగినేని సంయుక్తంగా నిర్మించారు. సహజమైన కథనం, వినోదభరితమైన సంభాషణలు, కొత్త తరహా స్క్రీన్‌ప్లేతో ప్రేక్షకులను ఆకట్టుకున్న ఈ సినిమా, అప్పటి వరకు పెద్దగా గుర్తింపు లేని పలువురు ప్రతిభావంతులకు కొత్త అవకాశాలు తెచ్చిపెట్టింది. 'పెళ్లిచూపులు' విజయ్ దేవరకొండ కెరీర్‌లో కీలక మలుపుగా నిలిచింది. సోలో హీరోగా ఆయనకు ఇది తొలి పెద్ద విజయం. సినిమాలో విజయ్ నటన, సహజమైన డైలాగ్ డెలివరీ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సినిమా విజయంతో వరుస అవకాశాలు అందుకున్న విజయ్, ఆ తర్వాత 'అర్జున్ రెడ్డి', 'గీత గోవిందం' వంటి విజయాలతో స్టార్ హీరోగా ఎదిగారు. ఈ చిత్రంలో హీరోయిన్‌గా నటించిన రీతూ వర్మ తన సహజమైన నటనతో ప్రేక్షకుల ప్రశంసలు అందుకుంది. ఆ తర్వాత తెలుగు, తమిళ భాషల్లో వరుస అవకాశాలు దక్కించుకుని ప్రముఖ కథానాయికగా గుర్తింపు పొందింది. ఇక దర్శకుడు తరుణ్ భాస్కర్ తొలి సినిమాతోనే తన ప్రత్యేక శైలిని నిరూపించుకున్నారు. 'పెళ్లిచూపులు' తర్వాత టాలీవుడ్‌లో క్రేజీ దర్శకుడిగా ఎదిగిన ఆయన, అనంతరం నటుడిగానూ తనదైన గుర్తింపు సంపాదించారు. బాక్సాఫీస్ దగ్గర మంచి విజయంతో పాటు విమర్శకుల ప్రశంసలు అందుకున్న 'పెళ్లిచూపులు' అనేక ప్రతిష్ఠాత్మక అవార్డులను కూడా సొంతం చేసుకుంది. ఈ చిత్రానికి రెండు జాతీయ చలనచిత్ర అవార్డులు లభించాయి. ఉత్తమ ప్రాంతీయ తెలుగు చిత్రంగా 'పెళ్లిచూపులు' జాతీయ పురస్కారం అందుకోగా, ఉత్తమ మాటల రచయితగా దర్శకుడు తరుణ్ భాస్కర్ నేషనల్ అవార్డు అందుకున్నారు. అలాగే 2016 సంవత్సరానికి గాను ఉత్తమ చిత్రం, ఉత్తమ నటి విభాగాల్లో రెండు నంది అవార్డులు కూడా ప్రకటించబడ్డాయి. ఇందులో రీతూ వర్మ ఉత్తమ నటి అవార్డుకు ఎంపికయ్యారు. అయితే ఆ సమయంలో నంది అవార్డుల ప్రదానోత్సవం జరగలేదు. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన రాష్ట్ర సినీ పురస్కారాల్లో కూడా 'పెళ్లిచూపులు'కు ప్రత్యేక గుర్తింపు లభించింది. ఈ చిత్రాన్ని సెకండ్ బెస్ట్ మూవీగా ఎంపిక చేసి చిత్రబృందాన్ని సత్కరించింది. దీంతో విడుదలై పదేళ్లు పూర్తయినా 'పెళ్లిచూపులు' ప్రస్థానం ఇంకా కొనసాగుతూనే ఉందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.




# రెండు భాగాలుగా రాకా

## వేయికోట్ల బడ్జెట్‌తో ప్లాన్ చేస్తున్నట్లు ప్రచారం




టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, డైరెక్టర్ అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న పాన్-వరల్డ్ ప్రాజెక్ట్ 'రాకా' సినిమాకు సంబంధించి ఓ సరికొత్త వార్త ఫిలింనగర్ సర్కిల్స్‌లో వైరల్ అవుతోంది. అనౌన్స్‌మెంట్‌తోనే భారీ అంచనాలను రేకెత్తించిన ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా సాగుతున్న సంగతి తెలిసిందే. అయితే ఈ సినిమాకు సంబంధించి తాజాగా ఒక క్రేజీ అప్‌డేట్ బయటకు వచ్చింది. మీడియా కథనాల ప్రకారం, 'రాకా' చిత్రాన్ని మేకర్స్ సింగిల్ పార్ట్‌గా కాకుండా రెండు భారీ భాగాలుగా తెరకెక్కించాలని ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తుంది. అంతేకాకుండా ఈ రెండు భాగాలను కలిపి ఏకంగా రూ.1000 కోట్ల భారీ బడ్జెట్‌తో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా రూపొందిస్తున్నట్లు సమాచారం. ఈ రెండు భాగాలలోనూ ఇద్దరు స్టార్ హీరోయిన్లు అలరించనున్నారు. ఒక భాగంలో అల్లు అర్జున్ సరసన బాలీవుడ్ బ్యూటీ దీపికా పదుకొణ్ నటిస్తుండగా, మరో భాగంలో టాలెంటెడ్ నటి మృణాల్ ఠాకూర్ ప్రధాన పాత్రలో కనిపించబోతున్నట్లు తెలుస్తుంది. ఇక కథాంశం విషయానికొస్తే, అట్లీ ఈ చిత్రాన్ని అత్యంత వైవిధ్యంగా ప్లాన్ చేశారు. ఒక పార్ట్‌ను పూర్తిగా హిస్టారికల్ బ్యాక్‌డ్రాప్ మరియు ఫాంటసీ ఎలిమెంట్స్‌తో తెరకెక్కిస్తుండగా, మరో పార్ట్‌ను పూర్తిగా భిన్నమైన ఫ్యూచరిస్టిక్ ప్రపంచంలో నడిచేలా రూపొందిస్తున్నారట. ఇందులో హిస్టారికల్ నేపథ్యంలో వచ్చే భాగంలో దీపికా పదుకొణ్ నటిస్తుందని తెలుస్తోంది. వీటితో పాటు ఈ చిత్రంలో బాలీవుడ్ బాద్షా షారుఖ్ ఖాన్ ఒక ప్రత్యేక అతిథి పాత్రలో కనిపించనున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఇప్పటికే అట్లీ దర్శకత్వంలో షారుఖ్ నటించిన 'జవాన్' బాక్సాఫీస్ వద్ద సంచలన విజయం సాధించడంతో, ఈ చిత్రంలోనూ ఆయన నటిస్తే సినిమా స్థాయి మరింత పెరుగుతుందని అభిమానులు భావిస్తున్నారు.

# చకచకా స్పిరిట్ షూటింగ్ పూర్తి

## వందరోజుల్లో పూర్తి చేసేలా ప్లాన్

టాలీవుడ్ మోస్ట్ అవైటెడ్ కాంబినేషన్‌లో వస్తున్న హై-వోల్టేజ్ యాక్షన్ చిత్రం 'స్పిరిట్' గురించి ఓ ఆసక్తికరమైన వార్త ప్రస్తుతం ఫిలింనగర్ సర్కిల్స్‌లో చక్కర్లు కొడుతోంది. సెన్సేషనల్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో ప్యాన్-ఇండియా రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్న సంగతి తెలిసిందే. ఈ సినిమా షూటింగ్‌ను కేవలం 100 రోజుల్లోనే పూర్తి చేయాలని దర్శకుడు సందీప్ రెడ్డి వంగా ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తుంది. ప్రస్తుతం ప్రభాస్ ఇతర ప్రాజెక్ట్‌ల షూటింగ్స్‌లో సమాంతరంగా పాల్గొంటున్నప్పటికీ, 'స్పిరిట్' టీమ్ మాత్రం తమ ప్లానింగ్ పక్కాగా ఉండటంతో సినిమా అనుకున్న సమయానికే పూర్తవుతుందని పూర్తి విశ్వాసంతో ఉంది. మరోవైపు ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించి సుమారు 40 శాతం షూటింగ్ పూర్తయినట్లు సమాచారం. మిగిలిన మేజర్ షెడ్యూల్స్ ఎక్కువగా హైదరాబాద్‌లోనే జరగనున్నాయి. ఇదిలావుంటే సందీప్ టీమ్ ప్లానింగ్ వలన ప్రభాస్ చేస్తున్న అత్యంత తక్కువ బడ్జెట్ సినిమా ఇదేనని తెలుస్తుంది. గత దశాబ్ద కాలంలో ప్రభాస్ చేసిన భారీ బ్జడెట్ సినిమాలతో పోలిస్తే 'స్పిరిట్' అత్యంత తక్కువ బ్జడెట్‌తో రాబోతుందని ఇప్పటికే టాక్ కూడా బయటకు పాకింది. ఇక దర్శకుడు సందీప్ రెడ్డి వంగా తనదైన మేకింగ్ స్టైల్‌తో ఈ చిత్రాన్ని మరింత పవర్‌ఫుల్‌గా తెరకెక్కిస్తుండటంతో, బాక్సాఫీస్ వద్ద మరో సంచలనం సృష్టించడం ఖాయమని అభిమానులు ఆశిస్తున్నారు.








# ఆదర్శ కుటుంబం నుంచి సంపూర్ణ పాత్ర

విక్టరీ వెంకటేష్ దగ్గుబాటి, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ అవైటెడ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'ఆదర్శ కుటుంబం హౌస్ నెం. 47' నుంచి చిత్రబృందం మరో ఆసక్తికర గ్లింప్స్‌ను విడుదల చేసింది. రోజుకో కొత్త వీడియోతో సినిమా ప్రచారాన్ని వేగవంతం చేస్తున్న మేకర్స్, తాజాగా ఈ చిత్రంలో వెంకటేష్ కూతురిగా, చిట్టిబాబు గారాలపట్టిగా నటిస్తున్న సంపూర్ణ (యువినా పార్థవి) పాత్రను పరిచయం చేశారు. పరిచయమైన ప్రతి ఒక్కరితో ప్రేమలో పడే జెన్‌జీ కూతురి పాత్రలో సంపూర్ణ కనిపించబోతుంది. ఇక త్రివిక్రమ్ మార్క్ సంభాషణలు, వినోదాత్మక ఘట్టాలతో నిండిన ఈ వీడియో సోషల్ మీడియాలో సినీ అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటోంది. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్. రాధాకృష్ణ (చినబాబు) నిర్మిస్తున్న ఈ భారీ చిత్రంలో నారా రోహిత్, నివేతా పేతురాజ్, రావు రమేష్, వెన్నెల కిషోర్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఎస్. థమన్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని అక్టోబర్ 2, 2026న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.

# 8న గ్రాండ్‌గా టాక్సిక్ ట్రైలర్ లాంచ్ ప్లాన్

యశ్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రం 'టాక్సిక్: ఎ ఫెయిరీటేల్ ఫర్ గ్రోన్‌అప్స్'. ఈ సినిమా నుంచి భారీ అప్‌డేట్ సిద్ధమైంది. 'టాక్సిక్' చిత్రబృందం ఆగస్టు 8న బెంగళూరులో గ్రాండ్‌గా ట్రైలర్ లాంచ్‌ను ప్లాన్ చేస్తోంది. ట్రైలర్ లాంచ్‌కి ముందు ప్రత్యేక మీడియా సమావేశం ఏర్పాటు చేసి దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ సినిమాకు సంబంధించిన ఆసక్తికర విషయాలు పంచుకోనున్నారు. యశ్‌తో పాటు ఐదుగురు హీరోయిన్లు హాజరుకానున్నారు. దేశవ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షించేలా ఈ ఈవెంట్‌ను నిర్వహించాలని నిర్మాణ సంస్థ ఏర్పాట్లు చేస్తోంది. భారీ స్థాయిలో రానున్న ఈ చిత్రాన్ని కన్నడ, ఇంగ్లిష్ భాషల్లో ఒకేసారి చిత్రీకరించారు. ప్రపంచవ్యాప్తంగా 40కి పైగా భాషల్లో డబ్ చేసి విడుదల చేయనున్నారు. ఆగస్టు 26న 'టాక్సిక్' ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, టీజర్, పాటలు నెట్టింట వైరల్ కాగా.. ట్రైలర్‌తో సినిమా అంచనాలు రెట్టింపు చేయాలని టీమ్ భావిస్తోంది. ఈ సినిమాలో బలమైన ఎమోషన్స్ ఉన్నాయని యశ్ అన్నారు. థియేటర్‌లో అందరూ ఆశ్చర్యపోతారన్నారు. యాక్షన్ సినిమాలంటే తనకు ఎంతో ఇష్టమని.. 'టాక్సిక్'లో హాలీవుడ్ స్టంట్ కోఆర్డినేటర్ జేజే పెర్రీ రూపొందించిన యాక్షన్ సీక్వెన్సులు సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లాయని తెలిపారు. ఇందులో ఈ రాకింగ్ స్టార్‌కు జోడీగా తారా సుతారియా, నయనతార, రుక్మిణి వసంత్, కియారా అద్వాణీ, హ్యూమా ఖురేషీ మెరవనున్నారు.

Printed, Published, Owned by MANNE LAXMAN Printed at Saketh Publications, 312, Trinetra Complex, Sangareddy, Telangana 502001 Published from SY. No. 212, Trinetra Complex, Veerabadra Nagar, Sangareddy, Telangana 502001 P.H: 9908123780, Email:navajyothinews@gmail.com, RNI no. TGTEL/25/A2372, EDITOR: MANNE LAXMAN